



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 4 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 24 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# పేదలకు ఆరోగ్య భద్రత మా బాధ్యత

- ప్రైవేటుకు ఇవ్వడం లేదు.. పీపీపీ కింద మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నాం
- నిర్మించి, నిర్వహించి, 33 ఏళ్ల తర్వాత తిరిగిస్తారు.. వైసీపీలా కట్టాలంటే 23 ఏళ్లు పడుతుంది
- మేం రెండేళ్లలోనే పూర్తిచేసి చూపిస్తాం.. పైగా అప్పటికంటే ఎక్కువ సీట్ల లభ్యత
- ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు.. ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తాం
- 90శాతం సిజేరియన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే.. ఇది ప్రమాదకర ధోరణి.. వెంటనే కట్టడిచేయాలి: సీఎం



"దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పటినుంచి పీపీపీ విధానం ఉంది. ఈ సంస్కరణలకు ముందు మిశ్రమ ఆర్థిక విధానం అమలైంది. అప్పట్లో ప్రభుత్వం పెట్టుబడులు పెడితే, ఫలితాలు కనిపించేవి కాదు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాం. దానివల్ల సంపద భారీగా పెరిగింది. ఆదాయమూ పెరిగింది. ఇప్పుడు మనం సూపర్ జీఎస్టీ, సూపర్ పొదుపు వరకు వచ్చాం. దేశం అంతా ఇలా ఒక దారిలో వెళ్తుంటే, వైసీపీ నేతలు మాత్రం మరో దారిలో ఉన్నారు.

- అసెంబ్లీలో ఆరోగ్య శాఖపై చర్చలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**


అనుకున్న ప్రగతిని త్వరితగతిన సాధించాలంటే పీపీపీ విధానమే మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో పేదలకు పూర్తి ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. "నేను సీఎంగా ఉండగా గతంలో జేగురుపాడు పవర్ ప్లాంట్‌ను పీపీపీ విధానంలో జీవీకే కంపెనీకి అప్పగించాను. దానిని పూర్తి చేసి తిరిగి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అదీ పీపీపీ మోడల్ పవర్. ఇదే విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించను న్నాం. ఆస్తి ప్రభుత్వానిది.. నిర్వహణ ప్రైవేటుది. బాగా నిర్వహించి, వచ్చిన లాభాలతో అప్పులు చెల్లించి, మిగిలిన దానిలో కొంత లాభం వారు తీసుకుంటారు. 33 ఏళ్ల తర్వాత ఆ ఆస్తిని ప్రభుత్వానికి తిరిగిచ్చేస్తారు" అని చంద్రబాబు వివరించారు. మంగళవారం అసెంబ్లీలో ఆరోగ్య శాఖపై జరిగిన లఘుచర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంపై తలెత్తుతున్న అనుమానాలను ఈ సందర్భంగా నివృత్తి చేశారు. ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా కార్యక్రమాలు - మిగతా2లో



## హెచ్-1బీ 'లాటరీ' విధానంలో మార్పులు!

- ఎంపికకు కొత్త ప్రతిపాదనలు
- అధిక నైపుణ్యం ఉన్న, ఉత్తమ వేతనాలు పొందే నిపుణుల ఎంపిక కోసం తాజా ప్రతిపాదనలు సిద్ధం
- ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో కీలక మార్పులు తెచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం
- హెచ్-1బీ వీసా ఎంపిక ప్రక్రియలో ఈ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలను ఫెడరల్ రిజిస్ట్రార్ తాజాగా విడుదల

6



## ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను

- ట్రంప్ నోట అదే మాట
- మరే ఇతర అధ్యక్షుడు వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు

## దండకారణ్యానికి భారీగా బలగాలు

కశ్మీర్ నుంచి తరలింపు.. మావోయిస్టుల అగ్ర నాయకత్వం అంతమే లక్ష్యం

6



## రాజధానిలో కార్యాలయాలు పెట్టండి


- రాష్ట్ర ప్రాజెక్టుల్లో భాగస్వాములుకండి
- బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరిన సీఎం
- రాష్ట్ర ప్రాజెక్టుల్లో భాగస్వాములవ్వండి..
- బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరిన సీఎం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

అమరావతిలో ప్రాంతీయ కార్యాలయాలను ప్రారంభించాలని, అలాగే రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో భాగంగా విజయవాడకు వచ్చిన పలు బ్యాంకుల చైర్మన్లు, ఎండీలకు సీఎం తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం హైటీ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులను వారికి వివరించారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నందున విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని బ్యాంకుల ఉన్నతాధికారులను సీఎం కోరారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు రాజధానిలో స్థలాలు కేటాయించామని, అక్కడ ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. 15 నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కేంద్ర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులను సీఎం వివరించారు. అన్ని రంగాల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు.

## మండలిలో మంటలు



- విశాఖ ఉక్కు, ఫీజు బకాయిలపై వాడీవేడి చర్చ
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు.. వందసార్లు చెప్పినా అర్థం కాదా?
- ప్లాంటును కాపాడుకోడానికి 14 వేల కోట్లు తెచ్చాం.. వైసీపీపై లోకేశ్ ధ్వజం
- ప్రైవేటీకరణ జరగాలని వైసీపీయే కోరుకుంటున్నట్లుగా ఉందని ఆగ్రహం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశంపై మంగళవారం శాసనమండలి అట్టుడికింది. ప్రైవేటీకరణ జరగదని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదనీ.. కూటమి వచ్చాక ప్రైవేటీకరణను నిలిపివేశామని.. స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి రూ.14 వేల కోట్లు తీసుకొచ్చామని చెప్పారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని వంద సార్లు చెప్పాం. ప్రభుత్వం తరఫున అంత స్పష్టంగా చెప్పినా మీకు (వైసీపీ) అర్థం కావడం లేదా? ప్రైవేటీకరణ జరగాలని మీరే కోరుకుంటు న్నట్లుగా ఉంది. అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారు' అని వైసీపీ ఎమ్మెల్సీలపై - మిగతా2లో

## చేసిందంతా చంద్రబాబే



- ఓటుకు కోట్లు కేసులో ఆయనదే కీలకపాత్ర..
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు నిందితుడు మత్తయ్య లేఖ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసేలా ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలని బలవంతం చేశారు.

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'అంతా ఏపీ సీఎం చంద్రబాబే చేశారు.. ఓటుకు కోట్లు కేసులో అతనూ కీలక నిందితుడే. నన్ను స్టీఫెన్‌సన్ వద్దకు పంపడంలో రేవంత్‌తోపాటు ఆయనదీ కీలకపాత్ర. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసేలా ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలని బలవంతం చేశారు. రూ. 5 కోట్లు ఆశ చూపాలని చెప్పా రు. కేసు నమోదయ్యాక పోలీసులకు దొరకకుండా నన్ను లోకేశ్ విజయవాడ తరలించారు. అత ని సన్నిహితుల సహకారంతో ఆరేడు నెలలు నిర్బంధించారు. ఈ కేసులో బాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావు సహా మరికొందరిని నిందితులుగా చేర్చి.. విచారణ చేపట్టాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి నిందితుడు మత్తయ్య లేఖ రాశారు. చంద్రబాబు, లోకేశ్.. ఈ కేసులో చేసిన - మిగతా2లో



## త్వరలో వందే భారత్ స్లీపర్!

- రైల్వే మంత్రి క్లారిటీ
- ప్రస్తుతం ఒక రైలు ఢిల్లీలో సిద్ధంగా ఉంది
- మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుంది

6

# పేదలకు ఆరోగ్య భద్రత మా బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్నామని, ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు. సిజేరియన్లు అధికంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని, ఈ విధానాన్ని ప్రభుత్వం సమర్థించబోదని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

**'పులివెందుల'కు మాత్రమే మెడికల్ కళ**

"గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలు కట్టినట్లు కడితే మరో 23 ఏళ్లు పడుతుంది. అంతకాలం మనుషులు బతికి ఉండాలి... అప్పుడుగానీ కాలేజీలు సిద్ధం కావు. కానీ, మేం అలా కాదు. పీపీపీ విధానంలో పూర్తి చేస్తాం. 17 మెడికల్ కాలేజీలు కట్టేశామని గొప్పలు చెప్పుకొని, ఫేక్ మాట్లాడి ప్రజల్ని గత వైసీపీ ప్రభుత్వం మభ్య పెట్టాలని చూసింది. ఇది సరికాదు. వాస్తవాలను వాస్తవాలుగానే చూడాలి. 17 మెడికల్ కాలేజీలు పెడతామని ఆనాడు ప్రకటించి, వీళ్లు (వైసీపీ) ఖర్చు చేసింది కేవలం రూ.1550 కోట్లు. అవన్నీ పూర్తి కావాలంటే మొత్తం రూ. 8480 కోట్లు ఖర్చు చేయాలి. అంటే వీళ్లు ఐదేళ్లలో వ్యయం చేసింది 17శాతమే. మేం రాగానే రూ.783 కోట్లు (తొమ్మిదిశాతం) విడుదల చేశాం. రాజమండ్రి మెడికల్ కాలేజీకి రూ.487 కోట్లకుగాను నాడు కేవలం రూ.81 కోట్లు ఖర్చు చేశారు. మేం 82 కోట్లు ఇచ్చాం. జగన్ ఊరు కాబట్టి పులివెందుల మెడికల్ కాలేజీకి రూ.500 కోట్ల గాను రూ.396 కోట్లు ఖర్చు పెట్టారు. పార్వతీపురానికి రూ.600 కోట్లు కావాల్సి వస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వాస్తవం ఇది కాగా, 'కాలేజీ కట్టేశాం.. మీరు దానిని ప్రైవేటుకు ఇస్తున్నారు' అని ఆరోపిస్తున్నారు. వీళ్లను ఏమనాలో తెలియడం లేదు. మనం ఆనాడు విజయనగరంలో ట్రైబల్ యూనివర్సిటీ పెట్టాలని నిర్ణయించాం. ఎయిర్‌పోర్టు దగ్గర మంచి వర్సిటీ వస్తుందని భావించాం. కానీ దాన్ని గత పాలకులు సాలూరికి తీసుకువెళ్లారని చెప్పారు. సాలూరుకు తీసుకువెళ్లారని దానిని అడ్డుకోను. సాలూరులో ట్రైబర్ వర్సిటీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాను. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలూ చెల్లించాం."

**ఆరోగ్యం మెరుగు.. పేద విద్యార్థులకు సీట్లు**

"ఆనాడు అన్ని విభాగాలను ధ్వంసంచేశారు. వాటిని సరిచేయడానికి చాలా సమయం పడుతుంది. అనుభవం ఉంది కాబట్టి చేయగలుగుతున్నాం. లేదంటే పిచ్చి బట్టి పారిపోయే పరిస్థితి. స్వభావరీత్యా నేను విధ్వంసాలకు దూరం. ఆనాడు వైద్యరంగాన్ని అభివృద్ధి చేయకపోగా.. మేం ఆ పని చేస్తుంటే వీళ్లు అబద్ధాలు చెబుతున్నారు. పీపీపీ కొత్తగా మనం తెచ్చింది కాదు. యూపీ, ఒడిశా, జార?ండ్‌లో పీపీపీకి ఇస్తున్నారు. ఐఐటీ చెన్నై, ఉదయపూర్ ఐఐఎం, నాగపూర్ ఐఐటీలో మౌలిక సదుపాయాల కల్పనను ప్రైవేటుకు అప్పగించారు. పీపీపీ విధానంలో ప్రతి పేదవాడి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. పేద విద్యార్థులకు ఎక్కువ సీట్ల వస్తాయి. ఎమ్మెల్యేలు ఈ విధానం గురించి తెలుసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్రంలో 1995-96 నాటికి ఆరు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. 2004నాటికి, అంటే పదేళ్లలో నా హయాంలో ఎనిమిది కాలేజీలు తెచ్చాను. ప్రస్తుతం రాష్ట్రంలో



ప్రభుత్వరంగంలో 18, ప్రైవేటురంగంలో 18, ఎయిమ్స్ 1, గీతం 1 మొత్తం కలిసి 38 కాలేజీలున్నాయి. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పేదఇంటికి ప్రపంచంలో ఉండే ఆధునిక విజ్ఞానం చేరవేయడమే సంజీవని కార్యక్రమం లక్ష్యం. దీనిని కచ్చితంగా అమలు చేస్తే నా జీవితంలో ఇంతకంటే మంచి కార్యక్రమం మరొకటి ఉండదు. క్వాలిటీ చెక్‌పలో 70.7 శాతం సంతృప్తి ఉంది. బెంచ్‌మార్కులో 80 శాతం కచ్చితంగా ఉండాలి. 90 ప్లస్‌కు చేరాలి."

**ఆరోగ్యాంధ్రే లక్ష్యం...**

"అందరికీ ఆరోగ్యం మన లక్ష్యం. రాష్ట్ర జనాభా 5.37 కోట్లు. 2047 నాటికి 5.41 కోట్లకు చేరతాం. 2047 నాటికి భారతదేశ జనాభా 162 కోట్లకు చేరుతుంది. దేశంలో యువకుల సమస్య పొంచి ఉంది. రాష్ట్రంలో 1.54 శాతం జననాల రేటు ఉంది. అది 2.1 శాతం కంటే తగ్గితే రాబోయే రోజుల్లో జనాభా తగ్గుతుంది. 2047నాటికి 1.35 శాతం మాత్రమే ఉంటుంది. మన ప్రయత్నం 2.1 శాతం చేరుకోవాలని.. భారతీయ ప్రభుత్వ వైద్య ప్రమాణాల ప్రకారం ఆరోగ్య పరంగా మనం మెరుగ్గా ఉన్నాం. డబ్లూహెచ్‌వో నిబంధనల ప్రకారం వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది విషయంలోను మనం ఫరవాలేదు. ఆరోగ్యాంధ్రే లక్ష్యం."

**పది టాస్క్‌ఫోర్స్‌లు వేస్తాం..**

"రాష్ట్రంలో ప్రధానంగా గుర్తించిన పది వ్యాధుల నివారణపై దృష్టిపెట్టాం. దీనికోసం మన దగ్గర ఉన్న ఉత్తమ వైద్యులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య నిపుణులను తెచ్చి 10 టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటుచేస్తాం. ఆయా వ్యాధులు ఏ జిల్లాలో ఉన్నాయో గుర్తించి ముందుకెళతాం. టాటా, బిల్‌గేట్స్‌తో కలిసి ఆరోగ్య సంరక్షణ కోసం పని చేస్తున్నాం. 'రియల్ టైమ్ మోనిటరింగ్ - పర్సనలైజ్ హెల్త్ కేర్ ఫర్ ఆల్ రెసిడెన్స్".. లక్ష్యంతో ముందుకెళుతున్నాం. పేదవాళ్లందరికీ రూ.25 లక్షల బీమా సదుపాయం కల్పిస్తున్నాం."

**అన్నీ అసత్యాలే..**

"కాలేజీలు, సీట్ల గురించి మొత్తం అసత్యాలే చెబుతున్నారు. పాత మెడికల్ కాలేజీల్లో 15 శాతం ఆల్ ఇండియా కోటా, 85 శాతం సీట్లు ప్రభుత్వానికి వస్తాయి. కొత్త కాలేజీల్లో ఆల్ ఇండియా కోటా 22 సీట్లు (15శాతం) వెళ్లగా, కన్వీనర్ కోటా 64 సీట్లు (42.5శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ (మేనేజ్‌మెంట్ కోటా) 45 సీట్లు (29.75శాతం), ఎన్ఆర్ఐ కోటా 19 సీట్లు (12.75) ఉండేలా గత ప్రభుత్వంలో కేటాయింపులు చేశారు. మా ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీలో ఆలిండియా కోటా సున్నా, కన్వీనర్ కోటా 75 సీట్లు (50శాతం), సెల్ఫ్ ఫైనాన్స్ 53 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు ఇస్తున్నాం. 11 సీట్లు (కన్వీనర్ కోటా) అదనంగా ప్రతి కాలేజీలో ఇస్తున్నాం. ఇంకెక్కడ మేం పేదలకు అన్యాయం చేశామో చెప్పాలి. నోరుంది. ఏదైనా మాట్లాడతా.. ఫేక్ న్యూస్ పెడతాం... మీరు ఏదైనా చేయండని అంటున్నారు. అసలు మనం ఎక్కడికి పోతున్నాం? మీరు కడితే 23 ఏళ్లు పడుతుంది. మేం రెండేళ్లలో పూర్తిచేసి చూపిస్తాం. ప్రైవేటుకు ఇవ్వడం కాదు.. పీపీపీ విధానంలో నిర్మాణాలకు ఇస్తున్నాం. పీపీపీ కింద తయారైన మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తాం. మందులు ఉచితం. ఎన్టీఆర్ వైద్య సేవ అమలు చేస్తాం. వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తాం. పేద వాళ్లకు అన్యాయం జరగకుండా చికిత్స, సీట్లలో వారికి అండగా నిలుస్తాం."

**డిప్యూటీ స్పీకర్‌కూ వర్తిస్తుంది..**

"ప్రధాని మంత్రి నరేంద్రమోదీకి 75 ఏళ్లు. నాకంటే ఆరు నెలలు చిన్న. దేశం కోసం ఈ వయసులో ఆయన అద్భుతంగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆయన లీవ్ తీసుకులేదు. నేను కూడా లీవ్ తీసుకోలేదు. ఆరోగ్యమే ఔషధం.. వంటిల్లే వైద్యశాల.. అనేది నేను ఎప్పుడూ చెబుతుంటాను. దానిని అనుసరిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుంది. రామ్‌దేవ్ బాబాను కలిసినప్పుడు.. 120 ఏళ్ల పాటు తినాల్సిన ఆహారం 40 ఏళ్లలోనే తినేస్తున్నారని ఆయన తెలిపారు. ఇది డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు కూడా వర్తిస్తుంది. (సరదాగా. సభలో నవ్వులు..) గతంలో మా ట్రస్ట్ ద్వారా న్యూట్రి ఫుడ్స్ ప్రారంభించాం. ఇప్పుడు ఏడు లక్షల మంది సభ్యులు ఉన్నారు. న్యూట్రి ఫుడ్స్ విధానం కింద పరీక్షలుచేసి.. సలహాలు ఇస్తున్నాం. మూడు నెలలకు ఒకసారి 41 రకాల పరీక్షలు చేసుకుని చాలామంది ఆహారనియంత్రణ పాటిస్తున్నారు."

**సిజేరియన్ తగ్గాలి...**

'రాష్ట్రంలో 52 నుంచి 62 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. ఇందులో 90 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య కింద జరిగే ఆపరేషన్లలో సిజేరియన్ల కోసం 4.12 శాతం ఖర్చుపెడుతున్నాం. డెలివరీ డేట్ నెల ముందే చెబుతున్నారు. ముహూర్తం పెడుతున్నారు.. ఇది చాలా తప్పు. ప్రమాదకర ధోరణి. డాక్టర్లు డబ్బుల కోసం సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్నారు. దీంతో సిజేరియన్లు మన రాష్ట్రంలోనే అధికంగా ఉంటున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి వారితో మాట్లాడాలి. దేవుడిచ్చిన సహజసిద్ధ శరీరాన్ని కోయడం సరికాదు. వేరే ఆరోగ్య సమస్యలు ఉంటే తప్ప, సాధారణ డెలివరీలనే ప్రోత్సహించాలి."

# చేసిందంతా చంద్రబాబే

-మొదటిపేజీ తరువాయి


దారుణాలను వివరించారు. మంగళవారం ఆ లేఖను ఢిల్లీలోని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రిజిస్ట్రార్ (ఇన్‌వార్డ్)కు అందజేశారు. సుప్రీంకోర్టు లేదా మరేదైనా హైకోర్టులో కేసు విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 17 అంశాలతో రాసిన లేఖలో ఆయన పేర్కొన్న వివరాల మేరకు..

**చంద్రబాబు, రేవంత్‌లే పంపారు..**

'ఓటుకు కోట్లు వ్యవహారంలోకి ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌లే నన్ను పంపారు. తీర్పును ప్రకటించే ముందు మరో సారి కేసుకు సంబంధించి పూర్తి వివరాలను క్షుణ్ణంగా చదవాలని కోరుతున్నా. కేసులో నా ప్రమేయంతోపాటు నేరానికి ప్రోత్సహించిన చంద్రబాబు, అతని కుమారుడు, మంత్రి లోకేశ్ ను కూడా నిందితులుగా చేర్చాలి. ఈ వ్యవహారంలో టీడీపీ నేతలు, పోలీసు అధికారులు, జడ్జీలు, న్యాయవాదులు, వారికి సహక రించిన ప్రతి ఒక్కరినీ నాతోపాటు సమగ్రంగా విచారించాలి. ఏసీబీ పోలీసుల దర్యాప్తులో అధికారిక సాక్ష్యాలు, చంద్రబాబు మాట్లాడిన రికార్డు.. దీని ఫోరెన్సిక్ నివేదిక, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రూ. 50 లక్షల నగదుపై దర్యాప్తు జరగాలి. చంద్రబాబు, రేవంత్ ప్రోద్బలంతోనే సెబాస్టియన్‌ను ఒప్పించా. 2016లో జరిగిన మహానాడులో చంద్రబాబు, రేవంత్‌లు నన్ను పిలిపించి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడారు. టీడీపీ అభ్యర్థికి ఓటు వేసేలా రూ. 5 కోట్లకు నాటి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను ఒప్పించాలన్నారు. ఈ వ్యవహారంలో నన్ను ప్రోత్సహించి, నాతో నేరం చేయించిన చంద్రబాబు, రేవంత్‌తోపాటు భాగ స్వాములైన వారందరిపై దర్యాప్తు చేసేలా ఆదేశాలు జారీ చేయండి' అని మత్తయ్య విజ్ఞప్తి చేశారు.

**రేవంత్‌ను సీఎంగా తప్పించండి..**

'ఈ కేసు విచారణ సజావుగా సాగి, నిజానిజాలు బయటకు రావాలంటే రేవంత్‌ను ముఖ్యమంత్రి హోదా నుంచి తప్పించాలి. నాతో సహా, నిందితులందరినీ విచారించేలా మళ్లీ విచారణకు ఆదేశించాలి. రేవంత్, వేం నరేందర్‌రెడ్డి, వేం కీర్తన్, ఉదయ్‌సింహ



తదితరులు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో అధికార పదవుల్లో ఉన్నారు. వారు ఏసీబీ అధికారులను ప్రభావితం చేసే అవకాశమే ఎక్కువ. కేసులో వారి పాత్ర లేకుండా చేసేలా ఒత్తిడి తెస్తారు. దర్యాప్తులో వారి ప్రమేయం ఉండకుండా, తప్పుదోవ పట్టకుండా, ఏసీబీ అధికారులను ప్రభావితం చేయకుండా ఉండాలంటే.. ముందుగా వారిని పదవుల నుంచి తప్పించాలి. విచారణ ముగిసేదాకా పదవులకు దూరంగా ఉండేలా ఉత్తర్వులు జారీ చేయాలి. అంతేకాదు, ఈ కేసు సుప్రీంకోర్టు లేదా ఏపీ, తెలంగాణేతర హైకోర్టులకు బదిలీ చేసి విచారణ చేపట్టాలి' అని మత్తయ్య కోరారు.

**లోకేశ్, అతని సన్నిహితులే నిర్బంధించారు**

ఈ కేసు నమోదైనప్పుడు తెలంగాణ పోలీసులకు నన్ను దొరకకుండా చేసేందుకు ప్రస్తుత ఏపీ మంత్రి నారా లోకేశ్ విశ్వప్రయత్నం చేశారు. ఆయన సన్నిహితులు కిలారి రాజేశ్, రేవంత్ అనుచరుడు జిమ్మీ బాబు, మరికొందరు కారులో నిర్బంధించారు. బలవంతంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించారు. ఆ సమయంలో కాళ్లూ, చేతులూ కట్టేయడంతోపాటు ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియకుండా ఉండేందుకు కళ్లకు గంతలు కట్టారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సుమారు ఆరేడు నెలలు అజ్ఞాతంలో ఉంచారు. నా భార్య, పిల్లలకు, తల్లిదండ్రులకు చూపించకుండా.. నా కుటుంబానికి దూరం చేశారు. ఏపీలోని పలు ప్రదేశాల్లో చీకటి గదిలో బంధించి, అడవుల్లో తిప్పుతూ అప్పటి పోలీసులు, లోకేశ్ సన్నిహితులు తీవ్ర వేధింపులకు గురిచేశారు. నేను ఎక్కడికీ వెళ్లకుండా కాపలాగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఇంటెలిజెన్స్ నాటి అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, అప్పటి డీజీపీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు, కృష్ణా జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా సహకరించారు. వారందర్నీ నిందితులుగా చేర్చి, విచారించాలి. విజయవాడలోని సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ కేసులో నాతో బలవంతంగా ఫిర్యాదు చేయించారు. 164 స్టేట్‌మెంట్‌పై బలవంతంగా సంతకం పెట్టించారు. వందకు పైగా తెల్ల కాగితాలపై బలవంతంగా సంతకాలు చేయించున్నారు. నా భార్యకు నామినేటెడ్ పదవి ఇస్తామని, అమరావతిలో ఇల్లు, వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామని, పిల్లల చదువు, భవిష్యత్‌కు సహకరిస్తామని నమ్మించారు. అలా 164 స్టేట్‌మెంట్‌పై సంతకం చేయించారు. టీడీపీ న్యాయవాదులు కనకమెడల, దమ్మలపాటి, మరికొందరు ఏపీ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాదులు వారికి సహకరించారు.

లోకేశ్ టీం, టీడీ జనార్ధన్, చంద్రబాబు పీఏ శ్రీనివాస్, కేబినెట్ మంత్రులు, అందరినీ ఈ కేసులో నిందితులుగా చేర్చి పూర్తిగా విచారణ చేయాలి. నేను ఈ లేఖలో పేర్కొన్న విషయాలన్నీ హైకోర్టులో లేదా సుప్రీంకోర్టు విచారణలో ప్రత్యక్షంగా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. నాలుగేళ్ల క్రితం సుప్రీంకోర్టులో "పార్టీ ఇన్ పర్సన్"గా పిటిషన్ వేశా. ఒక బాధ్యతగల పౌరుడిగా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఓటుకు కోట్లు కేసు నిందితుడిగా ఉన్నాను. చేసిన తప్పుకు సిగ్గుపడి పశ్చాత్తాపపడుతున్నా. తప్పు తెలుసుకొని నిజాలు చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నా. నన్ను అప్రూవర్‌గా అనుమతించండి' అంటూ మత్తయ్య సీజేఐని అభ్యర్థించారు.

# మండలిలో మంటలు

-మొదటిపేజీ తరువాయి

లోకేశ్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడుల కల్పన, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిపై లఘు చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని మీరే చెప్పి, మళ్లీ సభను తప్పుదారి పట్టిస్తున్నారని, ఎందుకు రభస చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో తమ సభ్యురాలిపై ఆయన అసభ్య పదజాలం వాడారని, వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయనవ్యాఖ్యలపై లోకేశ్ మండిపడ్డారు. 'వైసీపీ ప్రభుత్వంలో నిండు సభలో నా తల్లిని అవమానించారు. అప్పుడు మంత్రిగా ఉన్న బొత్స సభలోనే ఉండి ఏం చేశారు? ఓ తల్లిని అవమానిస్తే ఎంత బాధ ఉంటుందో కొడుకుగా నాకు తెలుసు. మా అమ్మ ఎంత కుమిలిపోయిందో నాకు తెలుసు. ఆమె కోలుకోవడానికి మూడు నెలలు పట్టింది.. ఆనాడు మీవాళ్లు ఏమన్నారో వీడియో చూపించాలా? నేను సభ్యురాలిని వరుదు కల్యాణి గారు అనే గౌరవించా. కావాలంటే రికార్డులు పరిశీలించండి.. మహిళలంటే నాకు అపార గౌరవం. మహిళలను తిడితే ఆనందపడే వ్యక్తులం మేం కాదు. మా నాయకుడు అలాంటి సంస్కారం మాకు నేర్పలేదు' అని స్పష్టంచేశారు. బొత్స స్పందిస్తూ.. అప్పుడు, ఇప్పుడు తాను ఖండిస్తున్నానని.. మహిళను ఎవరు కించపరిచేలా మాట్లాడినా తప్పేనని అన్నారు. అయితే ఆ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను బొత్స ఉపసంహరించుకోవాలని హోం మంత్రి అనిత డిమాండ్ చేశారు.

**ప్రధానికి ధన్యవాదాలు..**

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదని లోకేశ్ ప్రకటించినా తమకు అనుమానాలు ఉన్నాయంటూ వైసీపీ సభ్యులు పదే పదే ప్రస్తావించడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమయంలోనే లోకేశ్ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం ప్రతిపాదించారు. 'విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి కుమారస్వామికి ధన్యవాదాలు. రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం చిరస్మరణీయంగా ఉంటుంది. మూడో ఫర్నేస్ కూడా వినియోగంలోకి వచ్చింది. విద్యుత్ చార్జీల కింద కర్మాగారం చెల్లించాల్సిన రూ.3 వేల కోట్లను ఈక్విటీ కింద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదం తెలిపి కుమారస్వామి గారికి పంపాలని కోరుతున్నాను. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో నేను కూడా పాల్గొన్నాను. ప్రైవేటీకరణ జరగదని.. ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ఆనాడు హామీ ఇచ్చాం.. ఆ హామీకి మా మూడు పార్టీలు కట్టుబడి ఉన్నాయి' అని పేర్కొన్నారు. వైసీపీ దీనికి మద్దతిస్తుందో లేదో చెప్పాలని సూటిగా నిలదీయడంతో ఆ పార్టీ సభ్యులు సంపూర్ణంగా మద్దతిచ్చారు. అనంతరం తీర్మానాన్ని మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే పోటీగా వైసీపీ మరో తీర్మానం ప్రతిపాదించింది. 'ప్రజల సెంటిమెంటును దృష్టిలో ఉంచుకుని విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడుల ఉపసంహరణకు అవకాశం లేకుండా పూర్తి వాటా ప్రభుత్వానికే ఉంచుకుని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి. క్యాప్టివ్ గనులు కేటాయించాలి. విశాఖ ఉక్కు కర్మాగాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరాలి' అని అందులో పేర్కొన్నారు. ఈ తీర్మానంలో కొన్ని పదాలపై తమకు అభ్యంతరం ఉందని.. వాటిని సవరిస్తే ఆమోదం తెలపడానికి తమకు అభ్యంతరం లేదని అధికార పక్షం స్పష్టం చేసింది. లోకేశ్ జోక్యం చేసుకుని.. 'అసలు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ఎక్కడ? దానిని ఇప్పటికే పునరుద్ధరించాం. వైసీపీ తీర్మానం అసందర్భంగా ఉంది. ఆరు నెలల ముందు పెట్టి ఉంటే సందర్భోచితంగా ఉండేది. అప్పుడు తయారుచేసిన ప్రతిని ఇప్పుడు తీసుకొచ్చారు' అని వ్యాఖ్యానించారు. తమ తీర్మానాన్ని సవరణలు లేకుండా ఆమోదించాల్సిందేనని.. లేకుంటే ఓటింగ్‌కు వెళ్తామని బొత్స ప్రకటించారు. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏం చేస్తున్నామో లోకేశ్ ఇప్పటికే స్పష్టంగా చెప్పారని.. తమ తీర్మానాన్ని ఉపసంహరించుకుంటారా లేదా అనేది వైసీపీ విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. తర్వాత ఆ తీర్మానాన్ని మండలి చైర్మన్ తీసుకుని టేబుల్‌పై ఉంచారు. ఓటింగ్‌కు పెట్టలేదు.మొత్తానికి విశాఖ ఉక్కుపై వైసీపీ అస్పష్ట వైఖరితో సెల్ఫ్ గోల్ వేసుకుందన్న వ్యాఖ్యలు వినవచ్చాయి, మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైన లఘు చర్చ సాయంత్రం 4.22 గంటల వరకు సుదీర్ఘంగా సాగడం గమనార్హం.

**అప్పుడు, ఇప్పుడు కాపాడింది ఎన్‌డీఏనే..**

'గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడింది టీడీపీ, బీజేపీయే. 1998లోనే రూ.1350 కోట్లు కేటాయించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా కాపాడుకున్నాం. ఆ ట్రాక్ రికార్డ్ మాకు ఉంది. కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. అందరితో చర్చించాం. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకే ఏపీకి మినహాయింపు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి రూ.11,500 కోట్లు కేటాయించింది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని కలిశారు. నిర్మలా సీతారామన్‌తో రాత్రి 12.38 గంటలకు భేటీ అయ్యారు. మా దగ్గర ఫొటో ఉంది. కావాలంటే మీకు పంపిస్తా.. ఆ మీటింగ్‌లో ప్రైవేటీకరణ జరగకూడదని రివైవల్ ప్యాకేజీ ప్రకటించారు. కుమారస్వామి, నిర్మలా సీతారామన్,. ప్రధాని మోదీ ముగ్గురు కలిసి విశాఖ ఉక్కుకు పెద్దఎత్తున నిధులు కేటాయించి ఆదుకున్నారు. ఇదీ మా ప్రభుత్వ చిత్తశుద్ధి. మేమెప్పుడూ కేసుల మాఫీ కోసం ఢిల్లీ గడప తొక్కలేదు. ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రం గురించే అడిగామే గానీ.. సొంత ప్రయోజనాల కోసం అడగలేదు. రూ.11,500 కోట్లలో ఇప్పటికి రూ.9,800 కోట్లు ప్లాంటు ఖాతాలో డిపాజిట్ చేసిన ఘనత కూడా ఎన్‌డీఏ ప్రభుత్వానిదే. వైసీపీ హయాంలో ఒకే ఫర్నేస్ నడిచేది. ఉత్పాదన సామర్థ్యం ఆనాడు కేవలం 48 శాతం. సుమారు రూ.25 వేల కోట్లు అప్పు ఉండేది. ఇప్పుడు మేం మూడు ఫర్నేస్‌లను యాక్టివేట్ చేశాం. దాదాపు 80 శాతం కెపాసిటీ యుటిలైజేషన్‌కు తీసుకొచ్చాం' అని లోకేశ్ చర్చ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రతిపక్ష నేత హోదా ఇప్పించండి

అమరావతి

శాసనసభలో తనను ప్రతిపక్ష నేతగా గుర్తించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలంటూ పులివెందుల ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తనను ప్రతిపక్షనేతగా గుర్తించేందుకు నిరాకరిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని... దానిని రద్దు చేయాలని కూడా కోరారు. ఈ రూలింగ్ ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ చట్టంలోని సెక్షన్ 12-బికి విరుద్ధమని ప్రకటించాలని కోరారు. ప్రతిపక్షనేత హోదా కల్పించేలా ఏపీ శాసన వ్యవహారాల కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని విన్నవించారు. ఇందులో శాసన సభ కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, స్పీకర్ కార్యదర్శి, వ్యక్తిగత హోదాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా చేర్చారు. నిజానికి... తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేలా ఆదేశించాలంటూ గత ఏడాది జూలైలో జగన్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పీకర్ రూలింగ్ ఇచ్చారు. ఇప్పుడు స్పీకర్ రూలింగ్‌ను రద్దు చేసి, తనను ప్రతిపక్షనేతగా గుర్తించాలంటూ జగన్ మంగళవారం మరో పిటిషన్ వేశారు. "నాది అసమంజసమైన కోరికగా స్పీకర్ రూలింగ్‌లో పేర్కొన్నారు. అందులోని భాషను పరిశీలిస్తే నాకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయానికి వచ్చినట్లుగా ఉంది. న్యాయ నిష్పాక్షికత, పార్లమెంటరీ బాధ్యత, సమర్థ ప్రతిపక్షమనే మూలసూత్రాన్ని స్పీకర్ విస్మరించారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...





కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


బుధవారం 24
సెప్టెంబర్ 2025




www.viswamvoice.com

# డీఎస్సీ అభ్యర్థుల విజయవాడ ప్రయాణ ఏర్పాట్లు పూర్తి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** డీఎస్సీ%-%2025లో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల విజయవాడ ప్రయాణ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. విజయవాడ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమం లో పాల్గొనే అభ్యర్థుల కోసం నగరంలో ఆరు స్కూల్ లో ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు.కార్యక్రమానికి హాజరుకావడానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు ఒక సహాయకుడు/సహాయకురాలతో కలసి 24.09.2025 సాయంత్రం 4.00 గంటలకు రాజమహేంద్రవరం నందు వారికి కేటాయించిన పాఠశాలల వద్ద రిజిస్ట్రేషన్ నిమిత్తం హాజరుకావాలని కోరారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే.వాసుదేవరావు వివరాలు తెలియ చేస్తూ సంచాలకులు, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్ అమరావతి వారి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ%-%2025 నియామక పత్రముల జారీ కార్యక్రమం 25.09.2025న ముఖ్యమంత్రి సమక్షంలో విజయవాడలో జరగనున్నదన్నారు. ఇందు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు చెయ్యడం జరిగిందనీ తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు,



కాల్ లెటర్, దుప్పటి, తలగడ మరియు గొడుగు తీసుకురావాల్సిందిగా తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మరియు ఒక సహాయకుడి/సహాయకురాలికి వసతి, రాత్రి భోజనం, ఉదయం అల్పాహారం, అలాగే విజయవాడ ప్రయాణం కోసం బస్సు సౌకర్యం కల్పించబడినట్టు డీఈఓ వివరించారు.

**రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో డీఎస్సీ అభ్యర్థుల వసతి సౌకర్యాలు**

1. బి.వి.ఎం. ఉన్నత పాఠశాల, శ్రీరామనగర్, రాజమహేంద్రవరం పురుషుల కోసం: 900 సీట్లు19 గదులు
2. శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, మోరంపూడి, రాజమహేంద్రవరం అర్బన్ జెంట్స్ %ు% లేడీస్ కలిపి: 300 సీట్లు ు 6 గదులు
3. మున్సిపల్ ఉన్నత పాఠశాల, లాలా చెరువు, రాజమహేంద్రవరం అర్బన్ మహిళల కోసం: 400 సీట్లు ు 9 గదులు
4. శ్రీ సత్యసాయి గురుకులం ఇంగ్లీష్ మీడియం పాఠశాల, రాజమహేంద్రవరం మహిళల కోసం: 400 సీట్లు ు 10 గదులు
5. సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, బాలాజిపేట, శంభునగర్ ఫ్లైఓవర్ కింద, రాజమహేంద్రవరం అర్బన్ లో.మహిళల కోసం: 600 సీట్లు ు 14 గదులు
6.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ డైట్ కళాశాల దగ్గర, బొమ్మూరు లో మహిళల కోసం: 715 సీట్లు ు 14 గదులు..

## రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎస్.కె.బి.ఆర్ విద్యార్థిని



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాస్కెట్ బాల్ పోటీలలో స్థానిక ఎస్.కె.బి.ఆర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని మంగం రమ్య రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు తెలిపారు.ఈ పోటీలు ఇటీవల గొల్లల మామిడాడ హైస్కూలులో జిల్లా స్థాయి లో జరిగిన అండర్ 17 పోటీలలో రమ్య అత్యున్నత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని సుబ్బారావు తెలిపారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన రమ్యను కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శి లు నడింపల్లి సుబ్బరాజు,తాతా అవధాని,సభ్యులు డి.ఎస్.ఎన్. రాజు,పరిపాలనా ధికారి, ఎ.వెంకట పతి రాజు,పి.డి ,ఐ. సురేష్,అధ్యాపక,అధ్యాప కేతర సిబ్బంది అభినందించారు.

# దసరా ఉత్సవాలు కు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలి

**డి ఆర్ ఓ కే మాధవి**

**అమలాపురం , జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ సెప్టెంబర్ 23:** దసరా నవరాత్రి ఉత్సవా లను ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికా రిని కే మాధవి లైన్ డిపా ర్ట్మెంట్ అధికారులు ఉత్సవ కమిటీ పెద్దలు సమ న్వయం వహించాలని సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం నందు డివిజ నల్ అధికారులు ఉత్సవ ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వ హించి భద్రతాపరమైన చర్యలపై సమీ క్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతపరమైన ఉద్యమ అవాంఛనీయ సంఘటనలు పర్యవేక్షిం చేందుకు వీలుగా ఏడు వీధులలో ఏడు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి స్థానిక గడియారపు స్తంభం వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ కు డ్రోన్లను అనుసంధానం చేస్తూ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తా రన్నారు ప్రధానంగా ఉత్సవాల నిర్వహించే ఏడు వీధులలో ఉత్సవ విగ్రహ ఊరేగింపు లకు సంబం ధించిన అడ్డం కులను కమిటీ పెద్దలు సూచిస్తే వాటిని అధికారులు ముందుగా తొలగించ డం జరుగుతుంద న్నారు ప్రధానంగా పండుగలు, సామాజిక సంఘర్షణలు, వివాదాలు తలెత్తకుండా సజావుగా నిర్వహించాల న్నారు.అమలాపురంలో విజయదశమి రోజున జరిపే చెడి తాళింఖానా ఉత్సవాలు కోనసీమ



ప్రాంతానికి చెందిన అత్యంత ప్రాచీన వేడుకలలో ఒకటన్నారు. ఈ ఉత్సవాలు 1835 లో ప్రారంభమై ఇప్పటివరకు 189 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహించబ డుతున్నాయ న్నారు.చెడి తాలింఖానా ఉత్సవాలు అమలాపురం పట్టణంలోని ఏడు వీధుల్లో జరగుతాయనీ, విజయదశమి సందర్భంగా ఆయుధాల ప్రదర్శనలు, వాహన ఊరేగింపులు జరుగుతాయన్నా రు ఈ ఉత్సవాల్లో కర్ర సాము, కత్తిసాము, అగ్గిబరాటాలు, బల్లాలతో 60 రకాల యుద్ధ విన్యాసాలు ప్రదర్శిస్తార న్నారు .యుద్ధ కళల ప్రదర్శనలో యువకులు, వృద్ధులు పాల్గొన డం ప్రత్యేకత అన్నారు.ఈ ఉత్సవాలకు నాంది పలికినది స్థానిక మహిపాల వీధనీ అక్కడ మొదటి సారిగా చెడి తాలింఖా నా ఉత్సవాలు ప్రారంభం అయ్యాయన్నారు. ఏడు వీధుల్లో ఆయుధ ప్రదర్శ నలు, విన్యాసాలు . తెల్లారు జామున ఆయుధ పూజలు, తాళింగానా ప్రదర్శనల సమ్మేళనం జరుగు తుందన్నారు శరీరంపై కొబ్బరికాయలు, కాయగూరలు పెట్టి కత్తితో నరుకడం వంటి సాహసో పేత కార్యక్రమాలు జరుగు తాయన్నారు ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా చర్యలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.చెడిపై మంచికి నిక్కచ్చి విజయాన్ని సూచించే లా ఈ ఉత్సవాన్ని నూతనోత్సా హంతో, సామూహికంగా నిర్వహించడం ఘనతను చాటుతుందన్నారు.ఈ ప్రదర్శనలు కోనసీమ , సామాజిక ఐక్యతకు ప్రతిరూ పంగా నిలుస్తున్నాయన్నారు. స్థానికంగా దసరా చెడి తాలింఖానా ఉత్సవాలు ప్రాచీన యుద్ధ కళల సాంప్రదాయానికి, స్థానిక సంస్కృతికి ప్రతీక, విజయదశమి వేడుకల్లో ముఖ్య ఆకర్షణ అన్నారు పూర్తి శాంతి భద్రతల నడుము శాంతి యుతంగా ఎటువంటి సంఘర్షణలకు తావు లేకుండా దసరా ఉత్సవాలు సజావుగా నిర్వహించాలని ఆమె సూచిం చారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు పి వీరబాబు డి ప్రశాంత్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్, తాహసిల్దార్ అశోక్ ప్రసాద్ ఉత్సవ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## దసరాను శాంతియుత వాతావరణంలో జరుపుకుందాం...

**టౌన్ సిఐ డి సురేష్...**



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య ఈ దసరా ఉత్సవాలు జరుపుకోవాలని ఎదుటివారికి ఎలాంటి ఇబ్బందులు కలగచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టౌన్ సిఐ డి సురేష్ తెలిపారు. ఎటువంటి అసౌకర్యం కలగజేయకుండా శబ్దకాలుష్యానికి తావు లేకుండా పోలీసు వారు ఇచ్చిన సూచనలు నిబంధనలు పాటిస్తూ భక్తి భావాలతో జరుపుకోవాలని అన్నారు. దేవీ నవరాత్రుల మండపాలకు ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను వాడరాదని హెచ్చరించారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల మధ్యలో మాత్రమే స్పీకర్లను వినియోగించాలని అన్నారు. మండపాల వద్ద భద్రత దృష్ట్యా కమిటీ సభ్యులు రాత్రి సమయాలలో గస్తీ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. మండపాల వద్ద మండే స్వభావం జరిగిన వస్తువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అలంకరణల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. తమ మండపాల వద్ద ట్రాఫిక్ కి అంతరాయం కలగజేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీసులు, మండపాల కమిటీ సభ్యులు, భవానీలు తదితరులు పాల్గొన్నారు.

# జి ఎస్ టి తగ్గింపు పైహర్షం వ్యక్తం చేస్తూ ప్రదర్శన ర్యాలీ

# థాంక్యూ మోదీజీ అంటూ నినాదాలు..

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** భారతీయ జనతా పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మంగళవారం అమలాపురం పట్టణంలో జీఎస్టీ పేదలకు వరం, ప్రియతమ ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ అందించిన ప్రజారంజకమైన జీఎస్టీ గురించి హర్షం వ్యక్తం చేస్తూ మోడీ కి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రదర్శన ర్యాలీ జరిగింది, సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలాగా ఇప్పుడు వరకు ఉన్న జీఎస్టీ స్లాబులను తీసివేసి రెండు స్లాబులు కి మాత్రమే పరిమితం చేస్తూ 28% ఉన్న 18% నిత్యవసర వస్తువులు అయితే జీఎస్టీ జీరో చేసి ఒక పండుగ వాతావరణం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్లకార్డులతో జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన అతి వైభవంగా ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజి వేమ బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్




కుమార్ పాల్గొన్నారు, జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ భారతదేశంలో నివసిస్తున్న సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఏ పథకం తీసుకొచ్చినా వారికి అందుబాటులో ఉండేలాగ నిర్ణయాలు తీసుకుంటూ ఈ రోజున జీఎస్టీ విషయంలో కూడా సామాన్య మధ్యతరగతి ప్రజలకు అండగా ఉండేలా వారికి ఆర్థిక స్వాలంబన కలిగి తక్కువ ఖర్చు ఎక్కువ ఆదాయం అనే రీతిగా అందించిన, ఈ జీఎస్టీ హర్షణీయమని ఈ సందర్భంగా నరేంద్ర మోడీ కి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి పాలాభిషేకాలు జరిపామని జిల్లాలో మండల హెడ్ క్వార్టర్ లో గ్రామాల్లో కూడా బిజెపి కార్యకర్తల ద్వారా జిఎస్టి గురించి నరేంద్ర మోడీ కి సీతారామన్ కి పాలభిషేకాలు జరిపారని ఈ సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా పదాధికారులు కార్యవర్గ సభ్యులు జిల్లాలో ఉన్నఅన్ని మండలాల అధ్యక్షులు అధిక సంఖ్యలో బిజెపి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## జి ఎస్ టి తగ్గింపు పై ప్రధానికి ఆర్థిక మంత్రి కి పాలాభిషేకం.



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం ఎర్రమెల్లి విశ్వేశ్వరరావు పెట్రోల్ బంకు నందు మంగళవారం సాయంత్రం జీఎస్టీ ని తగ్గించిన శుభ సందర్భంగా భారత ప్రధాని ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు ఎర్రమెల్లి విశ్వేశ్వరరావు అధ్యక్షతన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా పూర్వపు అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ది చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాళ్ల దొరబాబు మాట్లాడుతూ చపాతీలు, పరోటాలు, పన్నీర్, యు హచ్ టి పాలు, కాక్రా, పిజ్జా, బ్రెడ్, తదితరులు బాగా తగ్గాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పి సి ఆర్ స్వామి, కే చిన్న, నూలి సూరిబాబు, పచ్చిగళ్ళ నర్సిబాబు, నంబూరి శ్రీనివాస్ గ్రంధి గుప్తా, ఎర్రమిల్లి సత్యనారాయణ, పాలూరి సత్యానందం , మోకా వెంకట సుబ్బారావు, అడపా సత్యనారాయణ, దూరి రాజేష్, చిట్టూరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర న్యాయవాదుల క్రికెట్ కెప్టెన్ దొంతమళ్ళ అశోక్ కుమార్.



**కాకినాడ రూరల్ :విశ్వం వాయిస్ న్యూస్.** నవ్య ఆంధ్ర అడ్వకేట్ (క్రికెట్ అసోసియేషన్) ఆద్వర్యంలో ఈనెల 27-9-2025 నుండి 2-10-2025 వరకూ న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా అడ్వకేట్స్ క్రికెట్ స్టేట్ టీమ్ కి ఆంధ్రప్రదేశ్ కెప్టెన్ గా కాకినాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది దొంతుమళ్ళ అశోక్ కుమార్ ఎంపిక అయ్యారు. న్యూఢిల్లీలో జరుగు ఆల్ ఇండియా అడ్వకేట్స్ 20- 20 క్రికెట్ టోర్నమెంట్లో ఆంధ్ర ప్రదేశ్ అడ్వకేట్స్ క్రికెట్ టీమ్ తరపున పాల్గొనుచున్నారు. ఈ విషయంలో పలువురు న్యాయవాదులు ఆయనను అభినందించారు.

## కాకినాడ జిజిహెచ్ లో 2డి ఎకో సేవలు ప్రారంభం...



**కాకినాడసిటీ :విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో 2డి ఎకో గుండె వైద్య పరీక్షలు మంగళవారం నుండి తిరిగి ప్రారంభమయ్యాయి. గత కొంత కాలంగా ఆగిపోయిన కార్డియాలజీ సేవలు ఇప్పుడు ఇన్ సోర్సింగ్ విధానంలో జరిగే విధంగా ఈ పరీక్షలు సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి చొరవతో 2డి ఎకో సేవలు ప్రారంభ మయ్యాయని డా ఎన్టీఆర్ వైద్య సేవల సమన్వయ అధికారి డా. వర ప్రసాద్ తెలియచేశారు. ఒక్క రోజునే 30 మందికి 2డి ఎకో పరీక్షలు చేయడం జరిగిందని తెలియచేశారు.

## ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం ఎస్ ఎన్ క్యాంపస్ లో పీజీ అడ్మిషన్లు ప్రారంభం.




**కాకినాడ రూరల్/( అచ్చంపేట జంక్షన్) విశ్వం వాయిస్ న్యూస్.** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో 2025%-%26 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొత్తం వివిధ పీజీ విభాగాలలో ఒక్కొక్క విభాగానికి గాను 33 సీట్లు భర్తీ చేయనున్నారు.ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ మాట్లాడుతూ %-% "ఆధునిక తరహా క్లాస్‌రూములు, పురుషుల మరియు మహిళల హాస్టల్ వసతి, కంప్యూటర్ లాబ్స్, డిజిటల్ లెర్నింగ్ సెంటర్స్, విశాలమైన లైబ్రరీ, హాస్టల్, క్రీడా వసతులతో కూడిన సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు క్యాంపస్ సిద్ధంగా ఉంది అలాగే గవర్నమెంట్ వారు అందించే అన్నిరకాల ప్రోత్సాహకాలు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం ఎస్ ఎన్ క్యాంపస్ లో చదివే విద్యార్థులకు అందుతాయి " అని తెలిపారు. ఎంఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లీష్, ఎంఎస్సీ మ్యాథ్స్ విభాగాలలో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి అని పేర్కొన్నారు . ఆసక్తిగల విద్యార్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు అడ్మిషన్స్ ఇంచార్జ్ కరీం 9701827564 లేదా నేరుగా అచ్చంపేట జంక్షన్ లో గల ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఎం ఎస్ ఎన్ క్యాంపస్ లో సంప్రదించవలసినదిగా కోరారు .



# ఎడిటర్ వాయిస్

## ఒడిదుడుకుల అమెరికా- భారత్ సంబంధాలు

రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ యుక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ 'సుంకాల రారాజు'గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయమైయమై బ్రెండెన్ ల్లించ్ నాయకత్వంలో క్రొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి రత్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహ తహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాల తో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఏంజైములుమ మాంస కృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సాంప్రపదాయలు,ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడము లేదు.

దీంతో డాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహము కిలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలు వస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాది మంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయివారు వీధినపడి ఆక్రోషిస్తున్నారు. రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తులో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమసతులు ఆగిపోయి 25 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ,అంచనా. అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేత జాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటాబయటా పెట్రేగి పోతున్నాడు. భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి భారత్ 64.3, దక్షిణ కొరియా 57 శాతం, టర్కీ అన్ని వస్తువులపై 17.3, భారత దేశం సగటున16.2 సుంకాలు విధిస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకము వల్ల సాగు ఖర్చు తక్కువ ఉత్పాదకత ఎక్కువ. 2024లో చైనా100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8 బిలియన్ దాలర్లవ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేనిస్థితి భారత ప్రభుత్వానిది. మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీల పై నామమాత్రంగా సుంకాలున్నాయి. అమెరికా కోడికాళ్లపై వాల్ నట్స్ పై 100శాతం, యాపిల్స్ పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నారు. మనదేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు. బియ్యం దదిగుమతిపై 70 శాతం ఉంది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆదేశానికి కూడా నష్టం కలిగిస్తాయని,ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వక్తమవుతున్నాయి. ప్రధాని మోడీ 2019 సెప్టెంబర్ లో అమెరికాలో పర్యటించి హ్యూస్టన్ లో జరిగిన సభలో ట్రంప్‌తో కర చాలనం చేశారు. ఇతర దేశాల ఆంతరంగిక రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదనే నియమాన్ని పక్కన పెట్టి 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ ట్రంప్ కు అనుకూ లంగా ప్రచారం చేశారు. అప్పుడు బిడెన్ గెలిచారు. అయినా సుంకాల విషయంలో రెండోసారి అధ్యక్షుడైన ట్రంప్ కరకుగా వ్యవహరిం చడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ఇప్పుడు ప్రధాని మోడీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుండి భారత అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్తాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ,ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది. 1971 లో ఎన్నికయిన షేక్ ముజిబుర్ రహమాన్ కు పాక్ సైనిక పాలకులుఅధికారం అప్పగించకిపోవడం,సైనిక దమన కాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది. లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు. దీటుగా అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సం.లో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడముతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారములోకి వచ్చిన భారత్‌మెరికా ప్రభుత్వాలు, నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. ఇటీవల భారత దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసినపుడు



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ



విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించ వలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధి లోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలు పంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం ఎరగని నిర్మల, సున్నిత మనస్కులు విద్యార్థులు. వారు కూడా సంఘజీ వులే, సంఘంలో భాగస్వాములే, సంఘసేవ వారికీ సామాజిక బాధ్యతగా ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహ ను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) ప్రారంభమైంది. నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో జాతిపిత మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారు. అప్పటి "విశ్వ విద్యాలయాల నిధుల సంఘం" (యూజీసీ) చైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించారు. 1959 జనవరిలో జరిగిన సీఏబీఈ పాలక మండలి ఆయన సూచనకు ఆమోదం తెలిపింది. 1952లో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడి, 4వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషనర్ ద్వారా 5కోట్ల రూపాయలను ఎన్ఎస్ఎస్ పథకానికి కేటాయించారు. 1958లో అప్పటి ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ దేశంలోని ముఖ్య మంత్రులకు జాతీయ సేవా పథకాన్ని అమలు చేయాలంటూ లేఖలు రాశారు. ఈ పథకానికి తగిన వ్యూహ రచన చేయాలని కూడా ఆయన కేంద్ర విద్యాశాఖను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 విశ్వ విద్యాలయాలలో సుమారు 40,000 మంది వాలంటీర్లతో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.రావు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 1999 నాటికి ఈ పథకంలో 13,52,000 మంది వాలంటీర్లు ఉన్నారు. 176 విశ్వ విద్యాలయాల పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సేవలందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ యూనిట్లను కళాశాల స్థాయిలో ప్రారంభించారు. లక్షలాది మంది వాలంటీర్లు సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. మొక్కల పెంపకం, పారిశుద్ధ్యం, రక్తదాన శిబిరాలు, అక్షరాస్యత వంటి కార్యక్రమాల్లో విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సామాజిక కార్యక్రమాల అమలులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒకనాడు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకవైపు విద్యా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు సంఘసేవకు విద్యార్థులను సమాయాత్త పరచేదే జాతీయ సేవా పథకం. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదునివ్వడమే గాక, వారి సేవలను వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుంది. కళాశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగాలకు ప్రిన్సిపాల్ పర్యవేక్షకుడిగా, ఒక అధ్యాపకుడు ప్రోగ్రాం అధికారిగా వ్యవహరిస్తారు. సమాజ సేవ పట్ల ఆసక్తి చూపే విద్యార్థులను ఇందులో చేర్చుకుంటూ, ప్రతి వందమంది విద్యార్థులను ఒక యూనిట్‌గా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూంటారు. రెండు విద్యా సంవత్సరాలలో కనీసం 240 గంటలు సంఘసేవలో పాల్గొనేలా కృషి జరుగుతోంది. భావితరాలకు వారసులైన విద్యార్థులు జట్లుగా పనిచేస్తూ ఐక్యతా భావాన్ని పంచుకుంటారు. సమాజంలో విద్యార్థి తన స్థానాన్ని, గమ్యాన్ని నిర్ణయించు కొనేలా చేయడం ఇందులోని ప్రధాన అంశం. విద్యార్థులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం ప్రధాన ధ్యేయం. కళాశాల ప్రిన్సిపాల్ నిర్ణయించిన ప్రకారం సమీప ప్రదేశాల్లో ఆలయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాలలో అపరిశుభ్రతను తొలగించడం, మంచినీటి సౌకర్యాల మెరుగుదలకు శ్రమదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ శిబిరాలలో నిర్వహిస్తుంటారు. ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి వసతులను గ్రామస్తుల సహకారంతో మెరుగు పరచేందుకు విద్యార్థులు కృషి చేస్తారు. రక్తదానం, ఉత్సవాలలో స్వచ్ఛంద సేవ, అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు విరాళాలు సేకరించి తగు సహాయ సహకారాలను అందించడం కూడా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలుగా ఉన్నాయి. అక్షరాస్యతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావడం, ఆరోగ్య సూత్రాలను బోధించడం, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లోనూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా విశ్వ విద్యాలయాలు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తాయి. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ లకు విలువ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్సు, మిలటరీ, నర్సింగ్ సర్వీసులలో, పోలీసు, టెలికాం, సమాచార వ్యవస్థ తదితర విభాగాల్లో నియామకాల సందర్భంగా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. 'నా కోసం కాదు, నీ కోసమే..' అనే దీక్షా నినాదంతో- సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం. యువతలో సామాజిక స్పృహను కల్పిస్తూ, వారిని సేవా భావంతో ముందుకు నడిపించడం నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. ఈ లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ సేవా పథకం ఎంతోమంది విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ పథకంలో చేరిన వారు క్రమశిక్షణ, సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకు రాణించే అవకాశం ఉంది.

# భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేద్దాం!

'హాలీవుడ్' పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాతస్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను "బాలీవుడ్" అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాలను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను "టాలీవుడ్" అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను "మాలీవుడ్" అని, కన్నడ సినీ పరిశ్రమను "సాండల్‌వుడ్" అని, పంజాబీ సినీ పరిశ్రమను "పాలీవుడ్" అని, గుజరాతీ సినీ పరిశ్రమను "డాలీవుడ్" అని, బెంగాలీ/మరాటీ/ఒడియా సినీ పరిశ్రమను "ఓలీవుడ్" అని, అస్సామీ సినీ పరిశ్రమను "జాలీవుడ్" అని, భోజ్‌పురీ సినీ పరిశ్రమను "భోజ్‌వుడ్" అని, తమిళ సినీ పరిశ్రమను "కోలీవుడ్" (చెన్నై, కొడంబాకమ్ పేరుతో) అని, లాహోర్ కేంద్రంగా పాకిస్థానీ సినీ పరిశ్రమను "లాలీవుడ్" అని పిలవడం పరిపాటి అయ్యింది. భారత "జాతీయ సినీ అవార్డుల ప్రదానం", "అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్" నిర్వహణ, "ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా" ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యింది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్- క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచి పోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన "రాజా హరిశ్చంద్ర" సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున "ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే)" పాటించడం 2014 నుంచి ప్రారంభం అయ్యింది. భారతీయ తొలి కలర్ సినిమా "కిషన్ కన్నయ్య" 1937లో విడుదల కావడం ఒక ప్రధాన అంశంగా తీసుకోవాలి. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ



ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగురంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్నభరిత కథ గమనాలతో "న్యూ బాలీవుడ" రంగులు పూసుకొని దేశ సరిహద్దులను చెరిపివేస్తూ ప్రపంచ మానవాళి ఇంటిలో, వారి మనసుల్లో తిష్ట వేస్తున్నది. నాటి బాలీవుడ్ సినిమాలు షోలే, దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, ముగల్-ఈ- ఆజామ్, త్రీ-ఈడియట్స్ లాంటి సినిమాలు ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను సహితం బద్దలు కొట్టడం జరిగిపోయింది. బాలీవుడ్ సినిమాల్లో అత్యంత పొడవైన సినిమాగా "ఎల్ఓసి కార్గిల్" సినిమా (గంటలు 4.15 నిమిషాలు) నిలిచింది. నేడు ప్రతి ఏట బాలీవుడ్ పరిశ్రమ నుంచి దాదాపు 1,000 సినిమాలు నిర్మితం అవుతున్నాయి. అన్ని భాషల్లో కలిపి భారతీయ సినీ పరిశ్రమ ద్వారా ఏడాదికి 3,000 సినిమాలు విడుదలై దాదాపు 10,000 సినీ థియేటర్లలో ప్రదర్శిస్తాం అవుతున్నాయి. ప్రపంచ బాలీవుడ్ దినోత్సవ వేదికగా మన సినీ పరిశ్రమ కీర్తిని చర్చించుకోవడం, పైరసీ సమస్యను కట్టడి చేయడం, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు తీయడం, డిజిటల్ యుగపు యువత దృష్టిని ఆకట్టుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరగాలి. వాణిజ్యపరమైన సినిమాలతో పాటు మన పునాదుల ఆధారంగా సంస్కృతి వారసత్వాలు ఉట్టిపడే విధంగా సినిమాలు తీయడం సమాంతరంగా కొనసాగాలి. సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.

విశ్వం వాయిస్
అవినీతిపై అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
బుధవారం 24 సెప్టెంబర్ 2025
www.viswamvoice.com


## అమలాపురం మండలం

### రెడ్డిపల్లి గ్రామంలో వైద్య శిబిరం

**అమలాపురం రూరల్ విశ్వం వాయస్ న్యూస్ అక్టోబర్ 23** అమలాపురం మండలం రెడ్డిపల్లి గ్రామంలో స్వస్తి నారీ స్వసస్థి పరివార అభియాన్ మెడికల్ క్యాంపు గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్. బిపి షుగర్. వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యులు ప్రజలకు సూచనలు ఇచ్చారు. మందులను ఉచితంగా అందజేశారు. అలాగే



రోగులకు కొన్ని రకాల టెస్టులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కరరావు. వెంకటేశ్వర కళాశాల కరస్పాండెంట్. కె.వి.ఆర్.ఎన్ నరసింహారావు. పి ఏ సి ఎస్ డైరెక్టర్ కొలిశెట్టి జయప్రకాష్.ఎంపీటీసీ సత్తి ఆదిలక్ష్మి సూరిబాబు. గ్రామ సచివాలయం కార్యదర్శి గణపతి. నల్లా సతీష్. వీఆర్వో గంధం దొరబాబు. కళాశాల ప్రిన్సిపల్ కె మనోహర్.పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సమనస రాంబాబు. వీర వేణి. వైద్యులు అమృత. అన్నామని. హేమ విజిత. పద్మజ. ఎం జ్యోతి. శివకుమార్. ఆనంద్ శేఖర్. అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు రాజేష్. యాలంగి వరప్రసాద్ జాన్ పాల్ శ్రీనివాస్తదితరులు పాల్గొన్నారు

### జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు

**అమలాపురం రూరల్ విశ్వం వాయస్ న్యూస్ అక్టోబర్ 23** అమలాపురం రూరల్ మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలను పూర్తి చేయించి ప్రజలందరకు రక్షిత మంచినీరు అందించాలని కోరుతూ ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు ఆధ్వర్యంలో



సర్పంచులు, ఎంపీటీసీలు మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు చేస్తున్నారని, అయితే వీటిలో ఎక్కువ శాతం 75 శాతం పనులు పూర్తికాగా మరో కొన్ని ట్యాంకులు 50 శాతం పనులు పూర్తయ్యి మధ్యలో పనులు నిలిచిపోయాయని కలెక్టర్ కు వివరించారు. ఇవి పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఒకవైపు ఆక్వా చెరువులు మరోవైపు ఓఎన్జిసి వంటి కార్యకలాపాల వల్ల మంచినీరు పూర్తిగా కలుషితం అయిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందువల్ల ప్రతీ ఒక్కరు రక్షిత మంచినీటి మీదే ఆధారపడి ఉన్నారని, త్వరితగతిన ట్యాంక్ నిర్మాణాలు పూర్తి చేయించి ప్రజల ఎదుర్కొంటున్న మంచినీటి కష్టాలను తీర్చాలంటూ కోరారు. అందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

### యువత డ్రగ్స్ బారినపడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

**రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై నరేష్.**


**ఆలమూరు (విశ్వం వాయిస్ న్యూస్):** మండల పరిధిలో కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల అవగాహనపై "డ్రగ్స్ వద్దు బ్రో" అనే వినూత్న కార్యక్రమం రావులపాలెం రూరల్ సిఐ, సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి నరేష్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారినపడి




బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, మాదక ద్రవ్యాల బారినపడి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ధూమ పానం, మద్యపానం, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. చదువుకునే వయస్సులో యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. తమ భవిష్యత్తు ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదిగే తరుణంలో మత్తుపదార్థాలకు దూరంగా ఉండి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నియమాలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ సురేంద్ర రెడ్డి, పోలీస్ శాఖ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### రెండు పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్ పి రాహుల్ మీనా

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో కాట్రేనికోన, ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ పోలీస్ స్టేషన్ లను సందర్శిస్తూ సిబ్బందికి సూచనలు జారి చేస్తున్న జిల్లా ఎస్పి.




శాంతి భద్రతల విషయంలో రాజిపడేది లేదని, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశాలు జారీచేయడమైనది.

## హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కార్యవర్గం నియామకం...

**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** రాష్ట్ర హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కార్యవర్గం ను నూతనంగా నియమించారు. మండపేట శాఖ అధ్యక్షులుగా మద్దుల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చంద్రు భార్గవ్ సాయిరాం చౌదరి లను నియమించారు.హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కర్నూలు బసవరాజు ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య, ఆర్యవైశ్య



వాణిజ్య విభాగం ప్రెసిడెంట్ నల్లమిల్లి సుబ్బారావు, ఈస్ట్ గోదావరి జిల్లా ప్రెసిడెంట్ రవి, వైస్ ప్రెసిడెంట్ రామరాజు ఆదేశాల మేరకు మండపేట పట్టణం అధ్యక్షుల కార్యవర్గాల నియామకం మంగళవారం జరిగింది.అనంతరం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులకు దిశా నిర్దేశం చేస్తూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ ,ఉచిత దర్శన ఏర్పాటు, దేవాలయాలలో గోశాల ఏర్పాటు, దేవాలయాలకు సంబంధించి భక్తుల సమస్యలు పరిష్కరించే దిశగా దేవాలయాల పరిరక్షణ కమిటీ పని చేస్తుందని అధ్యక్షులు సుబ్బారావు తెలిపారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ,కంకటాల మురళీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య, నల్లమిల్లి సుబ్బారావు రవి, రామరాజు, కోన సత్యనారాయణ, వాకచర్ల గుప్తా, కంచర్ల ప్రసాద్ పులవర్తి జగదీష్ ,సుమర్తి సురేష్, కొల్లూరు దుర్గాప్రసాద్ ,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 29 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందని వెల్లడించిన కలెక్టర్

**అమలాపురం, జిల్లా ప్రతినిధి, విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 23** మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు నవోదయం 2.0 కార్యక్రమాల అమలు పై జిల్లా స్థాయిలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షించారు ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్ర మా లను పటిష్టంగా అమలు చేస్తూ సారా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సారా పూర్తిగా అపరిశుభ్ర అశాస్త్రీయ పద్ధతులతో తయారు చేస్తారని విషపూరిత రసాయనాలు వినియో గిస్తారని ఆరోగ్యం




పూర్తిగా పాడైపోతుందనీ సామాజిక ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిని కుటుంబాలు చిన్న భిన్న మైపోతాయన్నారు నాటు సారాకు బానిసలు అయిన వారికి పునరావాసం కల్పిం చి సారా అమ్మకమే వృత్తిగా జీవించే వారికి ప్రత్యామ్నా య ఉపాధి అవకాశాలు జీవనోపాదులు రుణాలు రాయితీలతో కల్పించడం జరుగుతోందన్నారు. సారా త్రాగడం వల్ల కాలేయం మూత్రపిండాలు మెదడు నాడీ వ్యవస్థ నరాల తీవ్ర ప్రభావం ఉంటుందని కుటుంబం సామాజికంగా వెనుకబడుతుందని సమాజ వికాసానికి పల్లె ప్రగతికి మహిళల రక్షణకు అడ్డంకులు ఏర్పడతాయ న్నారు ఆర్థిక అంశాల పై తీవ్ర దుష్ప్రభావాలు కూడా ఏర్పడతాయన్నారు.సారా మహమ్మారిని తరిమి కొట్టి సారా రహిత గ్రామాల ను తీర్చిదిద్దాలన్నారు. నాటు సారాను పూర్తిగా నిర్మూలిం చి సారా రహిత గ్రామాలను స్వర్ణాంధ్ర కు సోపానాలుగా తీర్చిదిద్దాలని సూచించా రునవోదయం 2.0 సారా రహిత గ్రామాలుగా తీర్చిది ద్దే ముఖ్యమైన అంశాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుం టున్న కీలక చర్యలు పాల సీల ద్వారా గ్రామాల్లో నాటు సారా నిర్మూలన, ప్రజల ఆరోగ్య భద్రతకు, సామాజి క మార్పుకు అంకితభా వంతో కృషి చేయాలన్నారు సారా తయారీ విక్రయ కేంద్రాలను గుర్తించి, పదే పదే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పిడి చట్టం కింద కఠిన చర్యలు గైకొనాల న్నారు గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు, ప్రచార రథాలు, స్ట్రీట్ ప్లేలు, పోస్టర్లు, పత్రికలు, స్వయం సహాయక సంఘాల ద్వారా మద్యం ముప్పు, దుష్ప్ర భావాలను వివరిస్తూ ప్రత్యామ్నాయ జీవనోపా దుల కొరకు విక్రయాల్లో ఉన్న కుటుంబాలకు బ్యాంకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి అవకా శాలు కల్పించాలన్నారు ఇతర ప్రభుత్వ పథకాల కల్పన, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు ఇవ్వడం ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ శాఖలు సమిష్టిగా సారా రహిత గ్రామాలను, తీర్చి దిద్దాలన్నారు.ఇవన్నీ కలిపి నవోదయం 2.0 ద్వారా సారా రహిత గ్రామాల అభి వృద్ధికి నూతన దారులు, ఆరోగ్యమైన భవిష్యత్తు ఏర్పడేలా చర్యలు చేప ట్టాలన్నారు. తొలుత ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వి రేణుక పవర్ పాయింట్ ప్రజెంటేష న్ ద్వారా నవోదయం కార్య క్రమాల అమలుతీరు సాధించిన ప్రగతిని అధికా రులకు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో ఆలమూరు పి గన్నవరం ఆత్రేయపురం మండలాల లో సుమారు 29 గ్రామాల ను సారా రహిత గ్రామాలు గా తీర్చిదిద్దడం జరిగింద న్నారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ జీవనోపా దుల కొరకు మూడు కుటుం బాలను గుర్తించామన్నా రు. వీరిలో ఒకరికి హెూటల్ రెండోవారికి బడ్డీ వ్యాపారం మూడో కుటుం బానికి రవాణా వాహనం యూని ట్లకు డిఆర్డిఏ ద్వారా రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, డిఆర్ఓ కే మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ సాధికార అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి డిఆర్డిఏ పిడి గాంధీ జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్ వి ప్రసాద్ రావు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి...

**చైర్ పర్సన్ రాణి...**

**మండపేట టౌన్...విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూకదుర్గారాణి బస్టాండ్ ను శానిటేషన్ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ మహిళా స్త్రీ శక్తి ద్వారా ఎక్కువ మంది మహిళా ప్రయాణికులు బస్టాండుకు వచ్చి బస్సులలో ప్రయాణం చేస్తున్నార న్నారు. మండపేట బస్టాండ్ ను మరింత



పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పారిశుధ్య సిబ్బందిని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది నీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటేషన్ ,ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లు,శానిటరీ మేస్త్రి లు పాల్గొన్నారు.

## ఆనందంగా జరుపుకోండి సహకరిస్తాం.

**సైలెన్సర్ తీసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే తాటతీస్తాం.**

**ఫ్యాన్స్ ను సహకరించాలని కోరిన పట్టణ సీఐ వీరబాబు.**

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** బుధవారం రాత్రి ఓ జి సినిమా విడుదల సందర్భంగా అభిమానులు ఆనందంగా జరుపుకోవాలని పట్టణ సీఐ వీరబాబు అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా సైలెన్సర్లు పీకి రోడ్లపై విచ్చలవిడిగా తిరిగితే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. అమలాపురం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ నాయకులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దయచేసి ఎవరు విచ్చలవిడితనాన్ని ప్రదర్శించకుండా సినిమా చూసి



హాయిగా వెళ్లాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఫ్యాన్స్ నాయకులు తమకు సహకరించాలన్నారు. తప్పనిసరిగా తాము పోలీస్ లకు సహకరిస్తామని నాయకులు నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు, ఏడిద శ్రీను, సుదా చిన్నా, గుర్రాల కన్నా, ఆర్ డి ఎస్ ప్రసాద్, ముద్రగడ తదితరులు హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితి లో డి జె బాక్సులు అనుమతించమని పట్టణ సి ఐ వీరబాబు స్పష్టం చేశారు.

## రావులపాలెం భవానిల కలశ పూజ

**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** రావులపాలెంలో గురు భవాని సతీష్ ఆధ్వర్యంలో కేసిరెడ్డి నరసింహారావు ఇంటి వద్ద గోదావరి నది జలాలు తో ఊరేగింపుగా తీసుకుని వచ్చి గ్రామ దేవతలు అందరికీ చీరసారే సమర్పించుకుని వైభవంగా భవాని కలస పూజ జరిగినది .పూజలో 200 మంది భవానీలు పాల్గొన్నా



రు ఈ కార్యక్రమంలో టిటిడి వేద పండితులు పెడసనగంటి సీతారామ శాస్త్రి నరసింహరావును చిరుసత్కారం చేసి ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో పెద్దలు డి వెంకట రెడ్డి నందం సత్యనారాయణ వెలగల కాశిరెడ్డి మరియు భక్తులు భవానిలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 11:30 గంటల వరకు ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగినది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కేసిరెడ్డి నరసింహారావు భవాని ధన్యవాదాలు తెలియజేశారు.

## రావులపాలెంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**నిర్వహించిన బీజేపీ శ్రేణులు**

**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం :** ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభి షేకం నిర్వహించిన బీజేపీ శ్రేణులు. దేశ ప్రధానమంత్రి విశ్వగురునరేంద్ర మోడీ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం రైతుల కోసం సన్న కారు, చిన్న కారు ప్రజల కోసం జీఎస్టీ స్లాబ్ తగ్గించిన శు భ సందర్భాన్ని పురస్కరించుకుని



సోమవారం నాడు రావులపాలెంలో భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు నందం శ్రీలక్ష్మి నివాసం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధిని పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ స్లాబ్ లను తగ్గించి జీఎస్టీ నూతన సంస్కరణలతో నిత్యావసర సరుకుల జీఎస్టీ రేట్లను తగ్గించి దేశంలో అన్ని వర్గాల ప్రజలకు మేలుచేకూర్చుతూ తీసుకొచ్చిన జీఎస్టీ దసరా ఉత్సవాల నాడు అమల్లోకి రావడంతో ప్రధాని మోడీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న నిర్ణయాలకు ధన్యవాదములు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి గోనెమడతల కనకరాజు. బీజేపీ కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ గంద్రోతు వీరగోవిందరావు. మండల ప్రధానకార్యదర్శి మంచిగంటి కృష్ణ. నాయకులు వీరణాల రమణబాబు. పి. వెంకటలక్ష్మి.తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయండి


**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్** వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరాకు, పి. గన్న వరం నియోజకవర్గం కో ఆర్డినేట ర్ గన్నవరపు శ్రీనివాస్ రావు



పిలుపు మేరకు అంబాజీపేట మండల అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన ఆయన స్వగ్రుహం వద్ద మంగళవారం వైకాపా సమావేశం జరిగింది. అంబాజీపేటలొ వున్న 16 గ్రామల పరిశీలకలు గ్రామ కమిటీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఎం.పి.టీ.సి లు , సర్పంచ్ లు సమావేశంలో ఇంద్ర శేఖర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక మోసపురిత హామీలు ఇచ్చి గదద్దినేక్కరు వాటిని అమలు పరిచ్చేవరకు ప్రజలు వెంటే వుంటూ ప్రభుత్వని ఎండాకట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలొ జడ్పీటీసీ భూడిద వరలక్ష్మి , ఎం.పి.పి దొమ్మేటి వెంకటేశ్వరావు , పి.కె రావుగారు, ఎమ్.ఎమ్ శేట్టి , మైల ఆనందరావు , కొర్లపాటి కోటబాబు , దొమ్మేటి సత్యమోహన్ ,ముత్తబత్తుల ప్రశాంత్ ,సుదాబత్తుల రాము , కోట బేబీరాణి , బుడితి సత్యనారాయణమ్మ ,కాంద్రేగుల గోపి ,దేవరపల్లి బాలయోగి ,వడల కృష్ణ మూర్తి , నెల్లి పండు , పిల్లి రమేష్ , ఎల్లమల్లి జై బాబు, వైకాపా కార్యకర్తలు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలి లో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ బొమ్మి.....

**సమాధానం చెప్పలేక నీళ్ళు నమిలిన మంత్రి లోకేష్.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో తల్లికి వందనం పథకం అమలులోని లోపాలపై మంగళవారం శాసనమండలిలో అధికార పక్షాన్ని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ఏకిపారేసారు. గత ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మబడి పథకాన్ని కాపీ కొట్టి పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి 15, వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఎన్నికలు అయిన తర్వాత ఒక సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టి, చివరకు 13వేల రూపాయలు విద్యార్థుల తల్లి ఖాతాలో జమ చేయడం జరిగింది. ఇందులో దాదాపుగా 30 లక్షల మంది తల్లికి వందన పథకం విద్యుత్ బిల్లులు, ఫోర్ వీలర్, ఇన్కమ్ టాక్స్ ,చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే అంగన్వాడి, ఆశా వర్కర్లు మొదలగువారి పిల్లలకు తల్లికి వందనం పథకం ఎగ్గోట్టారు.ఎస్సీ, బీసీ విద్యార్థులకు 7 లేదా 8 వేల రూపాయలు వేసి చేతులు దులుపు కున్నారు ,అని కూటమి ప్రభుత్వం పై శాసనమండలిలో మండిపడ్డారు. రాష్ట్రంలో మొత్తం 87.42 లక్షల మందికి తల్లికి వందనం పథకం అమలు చేయవలసి ఉండగా, కేవలం 50 లక్షల మందికి అందించి దాదాపుగా 30 లక్షల మందికి ఈ పథకాన్ని ఎగ్గొట్టింది మీ ప్రభుత్వం కాదా అని ఆయన నిలదీశారు. ఇజ్రాయిల్ అడిగిన ప్రశ్నలకు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి లోకేష్ కచ్చితంగా సమాధానం చెప్పలేక నీళ్ళు నమిలారు. వివిధ కారణాల ద్వారా తల్లికి వందనం పథకం అందని విద్యార్థుల సంఖ్య స్పష్టంగా చెప్పలేకపోయారు.

# మహాశక్తి యాగంలో రెండో రోజు





భారీగా తరలివచ్చిన మహిళ భక్తులు....
.....అమ్మ లేకపోతే ఈ సృష్టే లేదు...
......శ్రీ పరిపూర్ణానంద స్వామి....

**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్ న్యూస్** మన కన్న తల్లి అమ్మ అనేది లేకపోతే మనం ఎలా లేమో ఆ అమ్మ లేకపోతే ఈ సృష్టే లేదు. హరిహర బ్రహ్మాదులు అయినా సరే అమ్మ అనుగ్రహం లేనిదే ఏది లేదు కాబట్టి అమ్మని అలాగే లోపల స్థిరపరచుకొని కుంకుమార్చనలో పాల్గొనాలని శ్రీ పరిపూర్ణానంద స్వామి వారు అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న "మహాశక్తి యాగం" కార్యక్రమం మంగళవారం ఎంతో ఘనంగా జరిగాయి. రెండో రోజు శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారిని శ్రీ హరిద్రా దేవిగా అలంకరించారు.అర్గళా స్తోత్ర, ఐశ్వర్యాంబికా హొమంలను వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. రెండో రోజు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కుంకుమ ఆరాధన సుమారు రెండు గంటల పాటు జరిగింది. ఈ సందర్భంగా శ్రీ పరిపూర్ణానంద స్వామి వారు మాట్లాడుతూ నిన్న అమ్మవారికి లక్ష అంకురార్చన చేసాం.అంటే నవధాన్యాల్ని కూడా మొలకెత్తించి ఆ అంకురాలతోటి అమ్మవారికి అర్చన చేసాం. ఆ అంకురాల్ని ఈరోజు మీరందరూ భోం చేసే మహాప్రసాదంలో వేయించాం అన్నారు. మనకు అన్నం అమ్మ పెడుతుంది అనుకుంటున్నాం.కానీ మొట్టమొదటి అమ్మ ఎవరో తెలుసా.? అన్నం తినాలంటే మొట్టమొదటి తల్లి, తండ్రి ఎవరు తెలుసా..?సూర్యుడు, చంద్రుడు లేకపోతే మనం తినే ఆహారం మొలవదు కాబట్టి మొదటి తల్లి తండ్రి వాళ్ళు అన్నారు.

తరువాత తల్లి తండ్రి ఆవు, ఎద్దు. ఆ ఆవు యొక్క ఎరువు పడకపోతే సారం లేదు ఎద్దు దున్నకపోతే భూమిని దున్నకపోతే పంట పండదు. కాబట్టి రెండవ తల్లి తండ్రి మనక ఎవరు గోమాత,వృషభము అన్నారు. ఆ తర్వాత మనకు తల్లి తండ్రిగా దొరికేది మన రైతు ఆయన పండించి తయారు చేసి మనకు పంపిస్తాడు అని అన్నారు.మనం కేవలం కళ్ళతో చూస్తే పొందే ఆనందాన్ని చక్షురానందం, ఇంద్రియ ఆనందం అంటాం. ఇప్పుడు అమ్మవారిని ఇక్కడ చూస్తున్నారు. ఒక ఆనందాన్ని పొందుతున్నారు. అమ్మవారి నామాన్ని పారాయణం చేస్తున్నారు. ఆనందాన్ని పొందుతున్నారు. అంటే వింటూ, చూస్తూ, ప్రసాదం తీసుకుంటూ, దాన్ని స్వీకరిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు.ఇలా రకరకాలుగా అమ్మ అనే పేరు చెప్పుకొని ఆనందాన్ని పొందుతున్నాం అని అన్నారు.

### 'మహాశక్తి యాగం' ఎక్కడా జరగలేదు

మహాశక్తి యాగంలో భాగంగా 100 కోట్ల కుంకుమార్చన కార్యక్రమం ఎక్కడా జరగడం లేదన్నారు. ఇంతలా భారీ సంఖ్యలో కూర్చుని కుంకుమార్చన చేసిన దాఖలాలు లేవని స్వామి వారు అన్నారు. పుట్టుక లేదు, చావు లేదు. స్థిరమైనది, శాశ్వతమైనది ఆ దైవం మాత్రమే. అమ్మని ఆశ్రయించడం అంటే అమ్మకి చేరువు అవ్వడం అన్నారు. అది పొందిన రోజు మీలో కలిగే ఆనందం ఈ సృష్టిలో, ఈ ప్రకృతిలో ఎక్కడా లభించదు అన్నారు. కాబట్టి అలాంటి అమ్మని మీరందరూ కుంకుమతో అర్చన చేస్తున్నారన్నారు. 100 కోట్ల కుంకుమార్చనలో మీరు భాగస్వాములై చేస్తున్నారన్నారు.

### 22 కోట్లకు చేరుకున్నాం

మొదటి రోజు కంటే రెండో రోజు 40 శాతం అదనంగా భక్తులందరూ పాల్గొన్నారు.రెండు రోజులూ కలిపి కుంకుమార్చన 22 కోట్లకు చేరుకున్నాం అని స్వామి వారు అన్నారు. వచ్చే మంగళవారం అమ్మవారిని బగళాముఖి దేవిగా అలంకరణ చేస్తాము. ఆ రోజు మీతో సహా మీ చుట్టుపక్కల వాళ్ళు, మీ బంధువర్గము ఎంతమంది అయితే వస్తారో ఆ రోజు ఒక్క ఒక్క రోజున అష్టమి నాడు మనం మూడు పారాయణలతోటి పూర్తి చేసుకునేలాగా ఒక విరాట్ పారాయణం ఆ రోజుతో పూర్తి అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 100 కోట్లు కుంకుమార్చన దాటాలి కాబట్టి ఆ రోజు అష్టమి. తిధులన్నిటిలో కల్లా అష్టమి చాలా ప్రభావం. చాలా ప్రమాదం అందుకనే ఆ ప్రమాదాలు తప్పాలన్నా ఆ తీవ్రమైన ప్రభావాలు, పరిణామాలు మన మీద ఉండకుండా ఉండాలన్నా ఆ తిధినాడు అమ్మవారిని మనం ఆరాధిస్తాం అన్నారు. అందుకే అమ్మవారు ఏం చేసింది అంటే అది ప్రభావవంతమైనది ప్రమాదకరమైన తిధి కాబట్టి ఆ అష్టమి చంద్రుని ఆవిడ నెత్తి మీద పెట్టుకుంది అని తెలిపారు. అష్టమీ చంద్ర విబ్రాజ దళికస్థల శోభిత మనకు ఆవిడ ఒక సంకేతం ఇస్తుందన్నారు. అష్టమి చంద్రుడు అష్టమి తిధి నాడు మనందరం అమ్మవారిని గట్టిగా ఆరాధన చేయాలి అని స్వామి వారు పిలుపునిచ్చారు. అందుకనే ప్రతి అష్టమి తిధికి అమ్మవారికి శ్రీపీఠంలో బగళాముఖి హొమం, వారాహి అమ్మవారికి ప్రత్యంగిరా హొమం కానీ చండీ హొమం కానీ ప్రధానంగా శ్రీపీఠంలో జరుపుతున్నామన్నారు. కాబట్టి ప్రతి అష్టమి నాడు అందరూ శ్రీ పీఠానికి విచ్చేసి ఆ హొమాన్ని దర్శించుకొని వెళ్లాలని కోరారు.

### 'లలితా' సినిమాను తెరకెక్కించనున్న జొన్న విత్తల

ప్రముఖ కవి, సినీ,గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మహాశక్తి యాగం జరుగుతున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్దేశించి స్వామి వారు మాట్లాడుతూ శ్రీ పీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగం కార్యక్రమానికి గత రెండేళ్లుగా ఆయన ఇక్కడకు వస్తున్నారన్నారు. శతకోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని చూసి ప్రభావితమై 'లలిత' అనే పేరుతో ఒక సినిమాను తీయబోతున్నారని తెలిపారు. కథ అంతా జొన్నవిత్తుల రాస్తున్నారన్నారు. లలిత సినిమాలో అమ్మవారే ఒక అమ్మాయి. సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా వస్తే ఎలా ఈ లోకాన్ని ఆవిడ అంటే తన చుట్టుపక్కల అన్నిటిని సవరించి సమర్ధించి తను నిలబడగలదో అలాంటి ఒక అద్భుతమైన కథ అన్నారు. అంటే అదేదో అమ్మవారు ఉంటారు అమ్మవారు అక్కడక్కడ కనబడుతుంటారు కానీ అమ్మాయే అమ్మవారి అనుగ్రహంతో ఒక అణువుగా ఇక్కడ అనుగ్రహంతో పుట్టి ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్ లాగా వచ్చి ఎలా ఉండాలి ఒక అమ్మాయి ఆత్మాభిమానంతో ఎలా ఉంటుంది ఆత్మ గౌరవంతో ఎలా ఉంటుంది తన శక్తి ఎలాంటిది అనేదాన్ని ఒక అద్భుతమైన కథ తయారు చేసి దాని యొక్క పాటలు తయారు చేశారన్నారు. మొన్న ఆ మధ్య ఒక పాటని విడుదల చేశారు. ఇప్పుడు లలితా సహస్రం మీద ఒక పాట రాశారు. ఇప్పటిదాకా చరిత్రలో ఎవరూ రాయలేని లలితా సహస్రం పాట అది.ఈ పాటని బుధవారం ఇక్కడే ఆవిష్కరించనున్నాం అని తెలిపారు.

### 29న సామూహిక సరస్వతీ పూజ

ఈనెల 29వ తేదీన శ్రీ పీఠంలో విద్యార్థినీ, విద్యార్థులతో సామూహిక వరలక్ష్మీ పూజను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ పీఠం ప్రాంగణంలో 24వేల మంది విద్యార్థులతో మనకి త్రికోటి మహాసరస్వతి పూజా కార్యక్రమం జరుగనుంది. మహా సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఉంటుంది. మహాసరస్వతి పూజ రిజిస్ట్రేషన్ కి అవసరమైన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసుకుని గానీ, లేదా శ్రీ పీఠం నెంబర్లకి మహా సరస్వతి పూజ అని మెసేజ్ చేస్తే దానికి అవసరమైన లింక్ పంపిస్తారు. అలా రిజిస్ట్రేషన్ చేసుకుని రావాలి. సామాగ్రి ఏమి తీసుకొని రావసరం లేదు. అన్ని ఇక్కడే ఇస్తారు. పూజ చేపిస్తారు. ప్రసాదం పెట్టి పంపిస్తారు. ఉదయం 6.30 గంటలకు ఈ ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు మీడియా ద్వారా తెలిపారు.

## పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని ధర్నా

**కాకినాడకలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** పోలవరం కాలువ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ తుని మండలం కుమ్మరిలోవ కోలనీకి చెందిన పలువురు వాసులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పోలవరం కాలువ నిర్మాణంలో సుమారు 300 మంది పైగా నిర్వాసితులవుగా వారిలో కొందరికి న్యాయం చేశారని ఇంకా 22 కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయం అందలేదని వారు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు అందించినా న్యాయం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించిన సహకారం మేరకు వారికి సహకరించామని అందువల్ల నిర్వాసితులైన 22 కుటుంబాల వారికి పునరావాసం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నాలో కుమ్మరిలోవ కోలనీ వాసులు కర్రి వెంకటేశ్వరరావు, దుంగల నాగేశ్వరరావు, గేదెల కృష్ణమూర్తి, సింగంపల్లి వెంకయ్య నాయుడు, తమరాన పైడినాయుడు, పైలా హేమని,



అరుగుల సుధారాణి, రంభ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యో నారాయణ హరి - తెలుగు దేశం నేత పర్వత సురేష్

శంఖవరం, అన్నవరంలో "స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాలు
గర్భిణీలకు అంగన్వాడీల పౌష్టికాహార ప్రదర్శన

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్యో నారాయణ హరి. నిస్వార్ధంగా వైద్య సేవలను అందించే వైద్యులు దేవుళ్ళతో సమానమని పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75 వ పుట్టిన రోజు సందర్భంగా దేశ వ్యాప్తంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 02 వరకు "స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" పథకం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని అన్నవరం జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల, శంఖవరంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ప్రత్యేక వైద్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. శంఖవరం వైద్య శిబిరాన్ని పర్వత సురేష్ ప్రారంభించారు. వైద్య బృందం ఏర్పాటు చేసిన మందులు పంపిణీ, ఔట్ పేషెంట్ల వివిధ ప్రత్యేక వైద్య పరీక్షల నిర్వహణా విభాగాలు, వీటికి అనుబంధంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సెప్టెంబర్ మాసం - గర్భిణీ స్త్రీల పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు అవగాహనకు శంఖవరం అంగన్వాడీ కార్యకర్తల బృందం నిర్వహించిన పౌష్టికాహార ముడి పదార్థాల ప్రదర్శనను సురేష్ పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ద్వితీయ వైద్యులు మోహన్ సాయిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైద్య అవగాహనా సభలో వైద్య బృందం, ప్రజలనూ ఉద్దేశించి పర్వత సురేష్ ప్రసంగించారు. ఏ స్థాయి వైద్యులైనా నిస్వార్థంగా వైద్య సేవలను అందిస్తూన్న వైద్య బృందం మనకు దేవుళ్ళతో సమానమని ఆయన పేర్కొన్నారు. కరోనా తర్వాత మనిషికి అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తు తున్నాయి. చిన్న రోగాలను సైతం పెద్ద రోగాలుగా చెప్తూ నమ్మించి కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యం చేస్తున్నాయంటూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే న్యాయమైన వైద్య సేవలు అందుతున్నాయని పరోక్షంగా చెప్పకనే చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి మానసిక పుత్రిక మహిళా సాధికారత అని, అందుకనే మహిళల ఆరోగ్యం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, దీంతో మహిళలకు మరింత ఆరోగ్య రక్షణ కలుగుతుందని సురేష్ పేర్కొన్నారు. శంఖవరం ప్రభుత్వ ఆస్పత్రి ద్వితీయ వైద్యులు మోహన్ సాయిరెడ్డి, దంత వైద్యులు రవిశంకర్ తోపాటు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి వైద్య నిపుణులు నరేష్, రౌతులపూడి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శాంతి రోగులకు ఉదయం నుంచి




సాయంత్రం వరకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ బి.వెంకట రజని నేతృత్వంలో తగు సలహాలు సూచనలను అందించారు. వీరు మధ్యాహ్నం 12 గంటల సమయానికే తమ సేవలను ముగించి వెనుదిరిగారు. అంతా సవ్యంగా, సంతృప్తికరంగా విజయవంతంగా ముగిసిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో కేన్సర్ పరీక్షల విభాగాన్ని ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత వైద్య నిపుణులు లేని వెలితి కొట్టొచ్చినట్టు కనిపించింది. వైద్య బృందాలు, సిబ్బందికీ ఆస్పత్రి ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ నేతృత్వంలో మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించారు.

## బాలుడు కు ఊపిరి అందించిన సానా ఫౌండేషన్.



**కాకినాడ రూరల్ : విశ్వం వాయిస్ న్యూస్.** చిన్ననాటి నుంచే తీవ్రమైన ఆరోగ్య సమస్యతో మంచానికే పరిమితమైన 14 ఏళ్ల బాలుడు ప్రేమ్ ప్రాణాలను కాపాడేందుకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ముందుకు వచ్చారు. వైద్యుల సూచన మేరకు ప్రేమ్‌కు నిరంతర ఆక్సిజన్ అవసరం కావడంతో, సతీష్ బాబు తన సానా సతీష్ ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయల విలువగల ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించి, బాలుడికి ఊపిరి పోశారు.పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన సుజాతకు ఏకైక కుమారుడు ప్రేమ్, పుట్టిన ఆరు నెలల నుంచే చిన్న మెదడు సమస్యతో బాధపడుతున్నాడు. ఇప్పటివరకు కుటుంబం దాదాపు ?12 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చు చేసినా, ప్రేమ్ పరిస్థితి మారలేదు. ఈ క్రమంలో, సుజాత తమ్ముడు రామకృష్ణ వివాహం చేసుకోకుండా తన సంపాదన అంతా మేనల్లుడి చికిత్సకు వెచ్చిస్తూ తోడ్పడుతున్నారు.ప్రభుత్వం అందించే వికలాంగుల పెన్షన్ సరిపోకపోవడంతో, వైద్య ఖర్చులు మోయలేని స్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ, ప్రేమ్ పరిస్థితిని సానా సతీష్ బాబు నిర్వహించే ప్రజాదర్బార్లో వివరించగా, వెంటనే స్పందించిన ఎంపీ సతీష్ బాబు, ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ద్వారా అవసరమైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు స్వయంగా ఈ ఆక్సిజన్కాన్సంట్రేటర్ ప్రేమ్ మేనమామ రామకృష్ణ కు అందజేశారు.ఇటీవల ప్రేమ్‌కు ఆక్సిజన్ కాన్సంట్రేటర్అందజేయడంతో పాటు, ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, ఎంపీ కార్యాలయ సిబ్బంది చింతపల్లి అర్జున్ కలిసి బాలుడు ఇంటికి వెళ్లి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వినియోగాన్ని స్వయంగా పరిశీలించారు. అలాగే ప్రేమ్ ఆరోగ్య పరిస్థితిని మేనమామ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నా మేనల్లుడు ప్రాణాలు నిలుపుకునేందుకు అత్యవసరమైన లక్ష రూపాయల విలువ గల ఆక్సిజన్ కాన్సంట్రేటర్అందించి ఊపిరి పోసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకి ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని భావోద్వేగంగా పేర్కొన్నారు.

## ఘనంగా ఆయుర్వేద దినోత్సవం.....




**కాకినాడసిటీ : విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలో ఆయుర్వేద దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా డి పృధ్వీ చరణ్ విచ్చేశారు.ఈ సందర్భంగా డా. ఎం. షహాద్ అలి (జిల్లా ఆయుష్ అధికారి) ఆయుర్వేద వైద్యపద్ధతి యొక్క ప్రాముఖ్యత, జీవన శైలి మార్పులు మరియు సమగ్ర ఆరోగ్యానికి ఆయుర్వేదం అందించే మార్గదర్శకాలను వివరిస్తూ ప్రసంగించారు. ప్రత్యేకంగా ఆయుర్వేద దినోత్సవం ఎందుకు జరుపుకుంటారో వివరించారు. ఆయుర్వేద దినోత్సవం ధన్వంతరి జయంతి సందర్భంలో జరుపుకుంటారు. ఆయనను ఆయుర్వేద పితామహుడిగా పరిగణిస్తారు.డా. షహ్లాద్ అలి ఈ సందర్భంలో ఋతుచర్య (సీజనల్ రిజమెన్) యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావం మన శరీరంపై ఎలా పడుతుందో, ఆయుర్వేదం దానికి అనుగుణంగా ఎలా మార్గదర్శన్ చేస్తుందో వివరించారు. ప్రతి ఋతువులో సరైన ఆహారం, నిద్ర, జీవన విదానంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజేశారు కాకినాడ జిల్లాలో 4 ఆయుర్వేద ఆయుష్ ఆరోగ్య మందిరములు ఉన్నాయి అన్ని కేంద్రాల్లో ఆయుర్వేద దినోత్సవాలు ఘనంగా జరిగాయి ఆరోగ్య మందిరాలలో యోగ మరియు పంచకర్మ వైద్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఆయుష్ ఆరోగ్య మందిరాలు: అచ్చంపేట( కాకినాడ దగ్గర), గుర్జనపల్లి (కరప మండలం), పెద్దబ్రహ్మ దేవము ( సామర్లకోట, బురుగుపూడి (కిర్లంపూడి మండలం) లో ఉన్నాయి.కార్యక్రమంలో డా. అరుణ జ్యోతి (యునానీ మెడికల్ ఆఫీసర్), కె. శ్రీనివాసు (హోమియో కంపౌండర్), శ్రీనివాస్, చంద్రబాబు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.సిబ్బంది మరియు రోగులు కూడా చురుకుగా పాల్గొని, ఆయుర్వేద దినోత్సవాన్ని మరింత విశిష్టం చేశారు.

## ....అక్కు ఎం ఎస్ ఎన్ క్యాంపస్,కాకినాడలో పీజీ అడ్మిషన్లు ప్రారంభం....





**కాకినాడరూరల్: విశ్వం వాయిస్ న్యూస్** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో 2025%-%26 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొత్తం వివిధ పీజీ విభాగాలలో ఒక్కొక్క విభాగానికి గాను 33 సీట్లు భర్తీ చేయనున్నారు.ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ మాట్లాడుతూ %-% "ఆధునిక తరహా క్లాస్‌రూములు, పురుషుల మరియు మహిళల హాస్టల్ వసతి, కంప్యూటర్ లాబ్స్, డిజిటల్ లెర్నింగ్ సెంటర్స్, విశాలమైన లైబ్రరీ, హాస్టల్, క్రీడా వసతులతో కూడిన సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు క్యాంపస్ సిద్ధంగా ఉంది అలాగే గవర్నమెంట్ వారు అందించే అన్నిరకాల ప్రోత్సాహకాలు అక్కు ఎం ఎస్ ఎన్ క్యాంపస్ లో చదివే విద్యార్థులకు అందుతాయి " అని తెలిపారు. ఎంఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లీష్, ఎంఎస్సీ మ్యాథ్స్ విభాగాలలో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి అని పేర్కొన్నారు . ఆసక్తిగల విద్యార్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు అడ్మిషన్స్ ఇంచార్జ్ కరీం 9701827564 లేదా నేరుగా అచ్చంపేట జంక్షన్ లో గల అక్కు ఎం ఎస్ ఎన్ క్యాంపస్ లో సంప్రదించవలసినదిగా కోరారు .

# ఘనంగా శ్రీశ్రీశ్రీ విజయదుర్గా అమ్మవారి దసరా మహోత్సవ వేడుకలు


## - భక్తులు 26తేదీన శుక్రవారం ఆలయం వద్ద సాయంత్రం నిప్పుల గుండం





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక కోటిపల్లిబస్టాండ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ విజయదుర్గా అమ్మవారి ఆలయం నందు 39వ దసరా మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షులు బట్లంకి నాగ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 22వ తేదీ సోమవారం కలశ స్థాపనతో అమ్మవారి దసరా మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయని, ఒక్కొక్క రోజు ఒక్కో రూపంలో అమ్మవారు దర్శనమిస్తారని, యధావిధిగా ప్రతీ రోజూ కుంకుమ పూజలు, చండీ హోమం ఉంటాయన్నారు. సెప్టెంబర్ 26తేదీ శుక్రవారం రోజు సాయంత్రం నిప్పుల గుండం ఆలయం వద్ద ఉంటుందని బాగా ప్రసిద్ధి చెందిందని భక్తులు, భవానీలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం సరస్వతీదేవి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి పూజకు భారీ ఏర్పాట్లు చేస్తామని పూజలు చేసుకోవడానికి పిల్లలు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. అక్టోబర్ 2వతేదీ విజయదశమి పండుగను పురకరించుకుని మహా పూర్ణాహుతి, సమీ పూజ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 10వ తేదీ శుక్రవారం మహా అన్న సమారాధన నిర్వహిస్తామ ని సుమారుగా పదివేల మందికి అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని సూరిబాబు,కార్య నిర్వాహక అధికారి యాళ్ళ గోపీనాధ్,కార్యదర్శి సూరిబాబు,ఉపాధ్యక్షులు వనం భాస్కర రావు, కుడుపూడి ప్రసాద్,మేడపు రెడ్డి చంద్రశేఖర్,దొడ్డి లోవరాజు,శ్రీనివాస్, ఆదిరెడ్డి శ్రీనివాస్, రాయుడు మల్లికార్జున రావు తదితరులు హాజరయ్యారు.

## నాదస్వరం విద్వాంసుడుకు నంది అవార్డు అందించిన శుభలేఖ సుధాకర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రికి చెందిన నాదస్వరం విద్వాంసుడు తోనంగి మణికంఠ కుమార్ నంది పురస్కారం అందుకున్నారు. విజయవాడ లబ్బీపేటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు శుభలేఖ సుధాకర్,ప్రముఖ నాదస్వరం విద్వాంసుడు వడ్డాది సత్యనారాయణ చేతుల మీదుగా ఈ పురస్కారం అందచేశారు. కార్యక్రమంలో డోలు విద్వాంసులు యాలూరు శ్రీనివాసులు, ఎలమంద రామ చంద్ర, తిరుపతి మునిరత్నం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవికి సత్య కిషోర్ దంపతులు ప్రత్యేక పూజలు.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** కాపవరం సెంటర్లో వేంచేసియున్న శ్రీ రాజ రాజేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించి ప్రకాష్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళవారం గాయత్రి మాతను కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో సత్య కిషోర్ దంపతులకు పూలమాలలు వేసి సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర, ఆలయ కమిటీసభ్యులు నీరుకొండ బాబ్జి, కాలచర్ల శ్రీనివాస్, పచారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## దశరథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన పెందుర్తి అభిరామ్



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రాపాక గ్రామానికి చెందిన పెందుర్తి దశరథ్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న రాజానగరం టిడిపి యువ నాయకులు పెందుర్తి అభిరామ్ సోమవారం రాపాక గ్రామంలో దశరథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి , ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నందు స్వస్థ నారి

# ససక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

ప్రజలందరూ ఆరోగ్యంతో ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు

మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** మారుతున్న ఆహారపు అలవాట్ల వలన ప్రజలు అనారోగ్యాలు బారిన పడుతున్నారని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి అన్నారు మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు స్వస్థ నారి ససక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచిత మందులను పంపిణీ చేసి పౌష్టిక ఆహార కిట్ ను అందించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యం గా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం చేయడం జరుగుతుందన్నారు . మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య విధానాల్లో మార్పులు తీసుకొస్తూ సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలని సంకల్పంతో అన్ని రకాల వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు 60 రకాల వ్యాధులకు పరీక్షలను నిర్మించడంతోపాటు ఆసుపత్రులను ఆధునీకరణ చేయడం జరుగుతుందన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిని చేయడం కోసం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిల ఆకర్షణకు గురై ప్రజలు ప్రభుత్వాసుపత్రులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలనే సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యం పై దృష్టి సారించడం జరిగిందని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎం పద్మ, ఫిజిషియన్ డాక్టర్ కె శారద, సర్జన్ డాక్టర్ ఎం కోటేశ్వరి, సూపరిండెంట్ ఎన్ రాజేంద్రప్రసాద్, తదితర డాక్టర్లు ఆసుపత్రి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు

## కొవ్వూరులో నూతనంగా సత్య శ్రీ బిర్యానీ పాయింట్ భోజన హెూటల్ ప్రారంభం



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు :** యువత స్వయం ఉపాధిని ఎంచుకొని వ్యాపారంగంలో అభివృద్ధి చెందాలని కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని మెయిన్ రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన సత్య శ్రీ బిర్యానీ పాయింట్ భోజన హెూటల్ ను తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమనే రామకృష్ణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని సీనియర్ తెలుగుదేశం నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటమణి రామకృష్ణ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన రుచికరమైన వంటలను అందించడం వలన వ్యాపారంలో అభివృద్ధి చెందగలమన్నారు. నూతన వ్యాపారంలో దినదిన అభివృద్ధిని చెందాలని కోరుకుంటున్నామన్నారు. భోజన ప్రియులకు రుచికరమైన వంటలను అందుబాటులో ఉన్న ధరలకు అందించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని తెలుగుదేశం నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్ క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు, తెలుగుదేశం నాయకులు బొబ్బిలి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు

## రెండవ రోజు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజ




**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** శరన్నవరాత్రుల లో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచిన భక్తులకు దీర్ఘాయుష్షు కలిగి సిరి సంపదలు సౌభాగ్యములు కలుగుతాయని శ్రీ రాజరాజేశ్వరి పీఠం వేద పండితులు పేర్కొన్నారు. శ్రీ శృంగేరి శంకర మఠం, శ్రీ రాజరాజేశ్వరి పీఠం పాతూరు నందు శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలను నిర్వహించారు. మంగళవారం రెండవ రోజు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి పీఠం పండితులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తొమ్మిది రోజులు పాటు పీఠం నందు 30 రకాల హెూమాలు జరుగుతాయని ప్రతి రోజు విశేష పూజలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు మహిళలు రాజరాజేశ్వరి అమ్మవారిని నిత్యం కొలవడం ద్వారా సకల సౌఖ్యములు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మాదిగలను ఓటు బ్యాంకు వరకే పరిమితం చేస్తున్నారా..

- నగర టీడీపీ కమిటీలో మాదిగలకు ప్రాధాన్యత ఎక్కడ..?
- ఇప్పటికైనా చిత్తశుద్ధి చాటుకోవాలి
- ఈతకోట భాపన సుధారాణి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ నగర కమిటీ నియామకం అయిన బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ నియామకంలో టీడీపీలోని మాదిగలకు ప్రాధాన్యత ఎక్కడ ఇచ్చారని ఈతకోట భాపన సుధారాణి ఒక ప్రకటనలో విమర్శించారు.ఈ అంశంపై ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, మోడీ సర్కారు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేసారని గుర్తుచేసారు.అయితే కూటమి ప్రభుత్వంలో మాదిగ సామాజిక వర్గాలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కారు లోన్ ,వ్యాపార లోన్స్ విషయంలో చాలా అన్యాయం జరిగిందని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా రాజమండ్రి నగర టిడిపి కమిటీ నియామకంలో మాదిగలను మరిచిపోయారు అని విమర్శించారు. ఇదంతా చూస్తుంటే,ఈ రాష్ట్రంలో టీడీపీలో మాదిగలను ఓటు బ్యాంకు వరకే పరిమితం చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా తగిన ప్రాధాన్యత మాదిగలకు కల్పించి చిత్తశుద్ధి చాటుకోవాలని సుధారాణి పేర్కొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలకు 60 ఎంబిఎ సీట్లు సాధించాం..

- మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** చారిత్రాత్మక ఆర్ట్స్ కళాశాలకు 60 ఎంబిఎ సీట్లు సాధించడం జరిగిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎంబిఎ సీట్ల విషయాన్ని సదరు కళాశాల యాజమాన్యం గతంలో తమ దృష్టికి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాను విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఉన్నత విద్య విభాగం అధికారులు, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆర్ట్స్ కళాశాలలో 60 సీట్లతో నూతనంగా ఎంబిఎ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సిటీ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు ఇది గొప్ప వరమన్నారు. తమ విన్నపాన్ని మన్నించి ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఎ కోర్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్న మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అల్లు రామలింగయ్య హెూమియో కళాశాలలో మరుగునుపడిపోయిన 26 పీజీ సీట్లను కూడా ఎంపీ దగ్గుబాటి పురంధ్వేరి వారి సహకారంతో తాము కేంద్ర శాఖామాత్యుల దృష్టికి తీసుకువెళ్లి తిరిగి పునరుద్ధరించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి గుర్తు చేశారు.

## బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు లోకేష్‌కు ఆహ్వానం అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉభయ గోదావరి జిల్లాల్లో తొలిసారిగా రాజమండ్రిలో సెప్టెంబర్ 21 నుండి 28 వరకు వారం రోజుల పాటు జరుగనున్న యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025 పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి నారా లోకేష్ కి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.


## సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలి

- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సూచన



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** అందరినీ కలుపుకుంటూ సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తెలుగుదేశం పార్టీ నగర నూతన కమిటీ సభ్యులకు సూచించారు. నూతన కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వీరు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో ఈ రోజు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ సమర్ధవంతమైన నాయకత్వానికి నగర కమిటీలో స్థానం దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ కష్టపడిన వారికి, సమర్ధులను గుర్తించి పదవులు ఇస్తుందనేందుకు ఈ కమిటీయే నిదర్శనమన్నారు.

## రైతులకు మామిడి జీడిమామిడిలో అధిక దిగుబడులపై శిక్షణ - రీని.




**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** మండలంలోని కనుపూరు నరసాపురం గ్రామాల్లోని రైతులకు మామిడి జీడిమామిడిలో అధిక దిగుబడులకు తీసుకోవలసిన చర్యలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఉద్యానశాఖ అధికారిణి రిని తెలిపారు. మంగళవారం పతాంజలి, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి, జీడిమామిడి రైతులకు మేలైన రకాల ఎంపిక, అధిక దిగుబడులకు సకాలంలో చేపట్టవలసిన చర్యలు వంటి అంశాలపై వివరించారు. మామిడిలోని మంగు, కొమ్మలు కత్తిరింపు, పండు ఈగ నివారణకు చేపట్టవలసిన చర్యలను తెలియజేశారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో సహజ సిద్ధ జీవఎరువులు, వివిధ రకాల చెట్ల కషాయం, వేప నూనె, సెనగపిండి, బెల్లంతో జీవామృతం తయారీ వంటి అంశాలను వివరించమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త విజయ్ కుమార్, పతాంజలి మేనేజర్ కార్తీక్, ఉద్యానశాఖ సిబ్బంది సాయిరాం, ప్రియాంక, సౌమిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు

# 11 రాష్ట్రాలు విపరీత అప్పులు




**న్యూఢిల్లీ :** దేశంలో రెవెన్యూ మిగులు రాష్ట్రాలు, అలాగే రెవెన్యూ లోటు రాష్ట్రాలపై కాగ్ ఆడిట్ నిర్వహించింది. కాగ్ ఆడిట్ ప్రకారం, 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ మిగులు రాష్ట్రాల్లో తెలంగాణ ఉండగా, రెవెన్యూ లోటు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది. మార్చి 2023 నాటికి దేశంలోని 28 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు రెవెన్యూ మిగులులో ఉండగా, మిగిలిన 12 రాష్ట్రాలు మాత్రం రెవెన్యూ లోటులో ఉన్నాయని కాగ్ ప్రకటించింది. రెవెన్యూ మిగులు ఉన్న 16 రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ రూ. 37 వేల 263 కోట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాలు తరువాత స్థానాల్లో ఉన్నాయి. అంటే 16 రాష్ట్రాల్లో మాత్రమే వ్యయానికి మించిన ఆదాయం సమకూరింది.
పదేళ్లలో దేశం ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడోస్థానంలో నిలవడమే తమ లక్ష్యం అని బీజేపీ నేతలు పదే పదే చెప్పుకుంటున్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలోనూ దీనిని ప్రధానంగా పేర్కొన్నారు. 5 స్థానానికి వచ్చింది నిజమే కానీ, మూడోస్థానం అంత ఈజీ కాదు. ఇక ఆర్థికంగా ఎదిగినా.. అప్పుల్లో కూడా గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. కాగ్ తాజా నివేదిక ప్రకారం, 2013?14 నుంచి 2022?23 వరకు 28 రాష్ట్రాల మొత్తం ప్రభుత్వ రుణం 17.57 లక్షల కోట్ల నుండి 59.60 లక్షల కోట్లకు చేరింది, అంటే 3.3 రెట్లు పెరిగింది. ఈ పరిణామం రాష్ట్రాల ఆర్థిక ఉత్పాదకతను బలహీనపరుస్తూ, స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రుణ శాతం 16.66 నుంచి 23 శాతానికి పెరిగింది. ఇది దేశ జీడీపీలో 22.17 శాతానికి సమానమైన 268.9 లక్షల కోట్ల భారాన్ని సృష్టించింది. ఈ ట్రెండ్ ఆర్థిక వృద్ధి మూలాలను దెబ్బతీస్తూ, భవిష్యత్ పెట్టుబడులకు అడ్డంకిగా మారుతోంది.రుణ స్థాయిలు రాష్ట్రాల మధ్య విస్తృతంగా మారుతున్నాయి. 2023 చివరి నాటికి, పంజాబ్ 40.35 శాతం జీఎస్‌డీపీతో అత్యధికం, నాగాలాండ్ 37.15 శాతం, పశ్చిమ బెంగాల్ 33.70 శాతంతో వచ్చాయి. ఇక బీజేపీ పాలిత గుజరాత్ 16.37 శాతం, మహారాష్ట్ర 14.64 శాతం రుణాలు నమోదయ్యాయి, అయితే ఒడిశా 8.45 శాతంతో తక్కువ రుణాలు తీసుకుంది. మొత్తంగా, ఎనిమిది రాష్ట్రాలు 30 శాతం మించిన రుణాలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ వైవిధ్యం పాలనా విధానాలు, ఆదాయ వనరుల పంపిణీలోని అసమానతలను ప్రతిబింబిస్తుంది.ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బీహార్, తమిళనాడు సహా 11 రాష్ట్రాలు 2023లో ఆర్థిక నిబంధనలు ఉల్లంఘించి రోజువారీ ఖర్చులకు కూడా రుణాలు సేకరించాయి. రుణాలు పెట్టుబడులకు మాత్రమే పరిమితం కావాలి, కానీ ఈ రాష్ట్రాలు బాండ్లు, ట్రెజరీ బిల్లులు, బ్యాంకు రుణాలు, ఆర్‌బీఐ వెయ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఎల్‌ఐసీ, నాబార్డ్ వంటి మార్గాల ద్వారా దీన్ని చేశాయి. ఇది రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరించాయి. దీర్ఘకాలిక స్థిరత్వానికి ముప్పుగా మారింది.కాగ్ నివేదిక మోడీ పాలనా దశలో రాష్ట్రాల రుణాల భారాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఆర్థిక సమతుల్యత లోపాన్ని సూచిస్తుంది. ఈ పరిణామాలు కేంద్ర?రాష్ట్ర సంబంధాల్లోని ఒత్తిడిని, ఆదాయ పంపిణీలోని సమస్యలను గుర్తుచేస్తాయి. రుణ నిర్వహణపై దృష్టి సారించకపోతే, దేశ ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉంది. యూపీ తొలి స్థానంలో ఉండగా, గుజరాత్ రూ. 19 వేల 865 కోట్లు, ఒడిశా రూ. 19 వేల 456 కోట్లు, ఝార్ఖండ్ రూ. 13 వేల 564 కోట్లు, కర్ణాటక రూ. 13 వేల 494 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 5లో నిలిచాయి. ఛత్తీస్‌గఢ్ రూ.8,592 కోట్లుతో 6వ స్థానం, తెలంగాణ రూ. 5,944 కోట్ల రెవెన్యూ మిగులుతో 7వ స్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్ రూ.5,310 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.4,091 కోట్లు, గోవా రూ.2,399 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 10లో ఉన్నాయి.ఇదే సమయంలో 12 రాష్ట్రాలలో రెవెన్యూ లోటు ఉందని కాగ్ పేర్కొంది. ఆ రెవెన్యూ లోటు మొత్తం రూ. 2,22,648 కోట్లుగా ఉంది. ఈ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. 2022–23లో రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు 14వ ఆర్థిక సంఘం రూ. 86,201 కోట్లు విడుదల చేసింది. ఇది మొత్తం లోటులో 39 శాతంగా ఉంది. బిహార్, కేరళ, మేఘాలయ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో తమ రెవెన్యూ వ్యయంపై 90 నుండి 100 శాతం వరకు రాబడి అందుకున్నాయి. 2022–23లో రెవెన్యూ లోటు గ్రాంట్లు, ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ఇచ్చే మొత్తం గ్రాంట్లలో 50 శాతంగా ఉన్నాయి. రాజస్థాన్, అస్సాం, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో రెవెన్యూ ఆదాయం 80 నుండి 90 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ లలో రెవెన్యూ ఆదాయం 75 నుంచి 80 శాతం వరకు ఉంది. అత్యధికంగా రెవెన్యూ లోటు పశ్చిమ బెంగాల్ (15.76 శాతం) కలిగి ఉంది, తరువాత స్థానాల్లో కేరళ 15.28 శాతం, ఆంధ్రప్రదేశ్ 12.24 శాతం, హిమాచల్‌ప్రదేశ్ 10.88 శాతం వంటి రాష్ట్రాలు ఉన్నాయి. 10 రాష్ట్రాలు ఆర్థిక సంఘం మొత్తం గ్రాంట్లలో 94 శాతం పొందాయి. ఆరోగ్య, పంచాయతీ రాజ్, పట్టణ సంస్థలు, విపత్తు ప్రతిస్పందన నిధి వంటి విభాగాలకు రెవెన్యూ లోటు గ్రాంటు నుండి మంజూరు చేసిన మొత్తం రూ. 1,72,849 కోట్లు. 50 శాతం రెవెన్యూ గ్రాంట్ ఉండగా, అధికంగా పంచాయతీ రాజ్ శాఖకు 26 శాతం, పట్టణ స్థానిక సంస్థలకు 11 శాతం, విపత్తు నిధికి 10 శాతం గ్రాంటును కేంద్ర ప్రభుత్వం అందించింది.

# బెంగళూరులో డిపాజిట్ భారం



బెంగళూరు : భారతదేశ ఐటీ రాజధానిగా పేరొందిన బెంగళూరు, సిలికాన్ సిటీగా ఖ్యాతి గడించింది. ఇక్కడి ఇంటి అద్దెలు సామాన్యులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. జీతంలో అత్యధికంగా ఇంటి అద్దెకే చెల్లించాల్సి వస్తోంది. అడ్వాన్స్ డిపాజిట్ డిమాండ్‌లు జనసామాన్యాన్ని, ముఖ్యంగా ఐటీ ఉద్యోగులను కలవరపెడుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోందిఇటీవల రెడిట్‌లో ఓ వినియోగదారు బెంగళూరులోని పణత్తూరు ప్రాంతంలో ఒక ఫ్లాట్‌కు నెలకు రూ.70 వేల అద్దె, రూ.5 లక్షల డిపాజిట్ అడుగుతున్నారని పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ ఐటీ ఉద్యోగులు, స్థానికుల మధ్య భారీ చర్చకు దారితీసింది. ట్రాఫిక్ సమస్యలు, వర్షంతో నీటితో నిండిపోయే రోడ్ల మధ్య ఇంత భారీ అద్దె డిమాండ్ చేయడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరు ‘ఇంత అద్దె భారం ఉంటే జీవనం ఎలా సాగించగలం?‘ అని ప్రశ్నించగా, మరొకరు చమత్కారంగా ‘కార్యాలయానికి దగ్గరగా ఉంటే చిన్న గదికైనా భారీ అద్దె చెల్లిస్తారు, కానీ ట్రాఫిక్‌లో చిక్కుకుంటారు‘ అని వ్యాఖ్యానించారు. ఇక పణత్తూరులో సగటు అద్దె రూ.41 వేలు ఉండగా, రూ.70 వేల అని పేర్కొనడంపై స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు.

అద్దెల పెరుగుదలకు కారణాలు

బెంగళూరులో ఇంటి అద్దెలు గతంలో ముంబై, ఢిల్లీలతో పోలిస్తే సాపేక్షంగా తక్కువగా ఉండేవి. అయితే, కొవిడ్?19 మహమ్మారి తర్వాత పరిస్థితులు గణనీయంగా మారాయి. ఈ అద్దెల పెరుగుదలకు కొన్ని కీలక కారణాలు ఉన్నాయి.

? కోవిడ్ తర్వాత ఐటీ సంస్థలు కార్యాలయాలకు తిరిగి రావాలని ఉద్యోగులను కోరడంతో, బెంగళూరుకు తిరిగి వచ్చే ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఇది గృహాల డిమాండ్‌ను పెంచింది.

? ఇళ్ల నిర్మాణం తగ్గడంతో సరఫరా డిమాండ్‌కు సరిపడటం లేదు, ఫలితంగా అద్దెలు పెరిగాయి.

? రద్దీగా ఉండే రోడ్లు, ట్రాఫిక్ సమస్యల కారణంగా ఉద్యోగులు కార్యాలయాలకు సమీపంలో ఉండేందుకు ఎక్కువ అద్దెలు చెల్లించడానికి సిద్ధపడుతున్నారు.

? స్థానికుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అద్దెలు పెరుగుతాయని, ఇది సహజమైన ఆర్థిక ఒడిదుడుకుల ఫలితమని చెబుతున్నారు.

మల్లేశ్వరం వంటి ప్రాంతాల్లో త్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లకు రూ.లక్షకు పైగా అద్దె ఉండగా, 11 నెలల డిపాజిట్ వసూలు సాధారణమైంది. ఇంటిని ఖాళీ చేసేటప్పుడు రిపేర్, పెయింటింగ్ ఖర్చుల పేరుతో డిపాజిట్‌లోంచి ఒక నెల అద్దె మొత్తాన్ని కోతపెట్టడం సర్వసాధారణంగా మారింది. ఇది అద్దెదారులకు అదనపు ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. బెంగళూరు ఐటీ రాజధానిగా ఉండటం వల్ల ఆర్థిక అవకాశాలు ఎన్నో అందిస్తున్నప్పటికీ, ఇంటి అద్దెల భారం సామాన్యులకు, ఐటీ ఉద్యోగులకు సవాలుగా మారింది. సోషల్ మీడియా చర్చలు ఈ సమస్య యొక్క తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.

## త్వరలో వందే భారత్ స్లీపర్..!




వందే భారత్ స్లీపర్ సర్వీసులకు సంబంధించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఒక రైలు దిల్లీలో సిద్ధంగా ఉందని, మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుందన్నారు. అది వచ్చిన వెంటనే రెండు కలిపి ప్రారంభిస్తామన్నారు. దిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. రైల్వే శాఖ గత పదేళ్లలో చేపట్టిన పలు కీలక ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఇక వందే భారత్ స్లీపర్ విషయానికొస్తే.. రెగ్యులర్ సర్వీసులు కొనసాగించాలంటే కనీసం రెండు రైళ్లు అవసరమని, అందుకే మరో దానికోసం వేచి చూస్తున్నామన్నారు. ఆ తర్వాతే ఏ మార్గంలో నడపాలనేది నిర్ణయిస్తామన్నారు. అయితే, బిహార్‌లో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు దిల్లీ నుంచి పట్నా మధ్య ప్రారంభించే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

## హెచ్-1బీ ‘లాటరీ’ విధానంలో మార్పులు!




హెచ్–1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచిన అమెరికా ప్రభుత్వం.. వీటికి సంబంధించి కొత్త నిబంధనలు తీసుకువచ్చే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధిక నైపుణ్యం ఉన్న, ఉత్తమ వేతనాలు పొందే నిపుణుల ఎంపిక కోసం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో కీలక మార్పులు తెచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. హెచ్–1బీ వీసా ఎంపిక ప్రక్రియలో ఈ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలను ఫెడరల్ రిజిస్ట్రార్ తాజాగా విడుదల చేసింది. తాజా ప్రతిపాదనల ప్రకారం.. హెచ్–1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ కొత్త నిబంధనలను వచ్చే ఏడాది నుంచి అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇవి అమల్లోకి వస్తే హెచ్–1బీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం వేతనాలు 2026 ఆర్థిక సంవత్సరంలో 502 మిలియన్ డాలర్లకు పెరుగుతాయని డీహెచ్‌ఎస్ అంచనా వేసింది. 2027లో 1 బిలియన్ డాలర్లు, 2028లో 1.5బి.డాలర్లు, 2029లో 2 బి.డాలర్లు పెరిగే అవకాశం ఉందని లెక్క కట్టింది.

## ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను



వాషింగ్టన్

ఐక్యరాజ్యసమితి సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. అమెరికా అధ్యక్షుడిగా కేవలం ఏడు నెలల కాలంలో ఏడు యుద్ధాలు ఆపాను. అందుకే తన పరిపాలన స్వర్ణయుగం అంటూ అభివర్ణించారు. అమెరికా న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 80వ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించారు. ‘ఇజ్రాయెల్ – ఇరాన్, భారత్–పాకిస్థాన్, రువాండా – డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, థాయిలాండ్–కంబోడియా, అర్మేనియా –అజర్‌బైజాన్, ఈజిప్ట్ – ఇథియోపియా, సెర్బియా –కొసావో దేశాల మధ్య అంతులేని యుద్ధాల్ని ముగించా. కొన్ని యుద్ధాలు 31 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. మరికొన్ని 36ఏళ్లుగా కొనసాగుతున్నాయి. అలాంటి అంతులేని యుద్ధాల్లో నేను ఏడు యుద్ధాలు ఆపాను. మరే ఇతర అధ్యక్షుడు వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు. కానీ నేను వాటిని ఆపాను. భారత్–పాక్ యుద్ధాన్ని కూడా నేనే ఆపా. ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నా. ప్రజల ప్రాణాలు కాపాడటమే నాకు అసలైన నోబెల్ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిపై విమర్శలు గుప్పించారు. యుద్ధాలు ఆపడంలో ఐక్యరాజ్యసమితి ఘోరంగా విఫలమైంది. ఐక్యరాజ్యసమితి తన ప్రాముఖ్యతను కోల్పోయింది. దేశాల మధ్య యుద్ధ సమస్యల్ని పరిష్కరించేలా సహాయం చేసేందుకు ప్రయత్నించలేదు. ఐక్యరాజ్యసమితి తన సామర్థ్యాన్ని కోల్పోయింది. ఐక్యరాజ్య సమితివన్నీ ఒట్టి మాటలే. ఆ ఒట్టి మాటలు యుద్ధాల్ని ఆపలేవు’ అని ట్రంప్ అన్నారు.

## దండకారణ్యానికి భారీగా బలగాలు

న్యూఢిల్లీ

మధ్యభారతంలో మావోయిస్టుల అంతమే లక్ష్యంగా విరుచుకుపడుతున్న కేంద్ర బలగాలు నిర్ణయాత్మక దాడులకు సిద్ధమవుతున్నాయి. నక్సల్స్ కదలికలు ఉన్న ఛత్తీసగఢ్, జార?ండ్, ఒడిశా, మహారాష్ట్రలకు మరిన్ని బలగాలను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూకశ్మీర్‌లో నియమించిన కేంద్ర పోలీస్ సాయుధ బలగాల్లో (సీఏపీఎఫ్) ఇంకా అక్కడే ఉండిపోయిన వారిలో 80్న మేర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ విషయాన్ని సీఏపీఎఫలోని సీనియర్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మావోయిస్టు నాయకత్వాన్ని భౌతికంగా బలహీనపరచడం...ఇప్పటికీ వారి చేతుల్లోని ప్రాంతాలను ఒక్కొక్కటిగా స్వాధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా అదనపు బలగాలను కేటాయిస్తున్నట్టు తెలిపాయి. రాబోయే కొన్ని వారాల్లో అవి ఎర్ర బీభత్స ప్రాంతాలకు (రెడ్‌జోన్) చేరుకుంటాయని తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల రహిత భారత్‌ను నిర్మిస్తామని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకుగాను కేంద్ర కమిటీ సభ్యులపై గురిపెట్టి కేంద్ర బలగాలు దాడులు సాగిస్తున్నాయి. తాజాగా ఒకే ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా), కడారి సత్యనారాయణరెడ్డి (కోసా) మృతిచెందారు. ఈ ఏడాదిలో దాదాపు ఎనిమిదిమంది సీసీ సభ్యులను ఎన్‌కౌంటర్ చేశారు. ఒక సీసీ మెంబరు లొంగిపోయారు. నాయకుల్లో అధిక భాగం ఛత్తీసగఢ్, జార?ండ్, ఒడిశాల్లో తలదాచుకున్నట్టు కేంద్ర హోంశాఖ వద్ద సమాచారం ఉంది. ఈక్రమంలో ఈ మూడు రాష్ట్రాలపైనే దృష్టి పెట్టి.. అదనపు బలగాలను అక్కడకు అధికంగా తరలించాలని నిర్ణయించింది. మావోయిస్టులు చేస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర బలగాలు తిరస్కరించాయి. బలగాల దృష్టిని మళ్లించడం కోసం ఒక ఎత్తుగడగా ఈ ప్రతిపాదన చేస్తున్నారని పెదవి విరిశాయి. ఇటువంటి ప్రతిపాదనలతో మావోయిస్టులు ముందుకురావడం కొత్తకాదని, వాటికి పెద్దగా సాధికారికత కూడా లేదని కేంద్ర హోంశాఖలోని సీనియర్ అధికార వర్గాలు తెలిపాయి. సీనియర్ నాయకులు చనిపోతుండటంతో ఇప్పటికే ఆత్మరక్షణలో పడిపోయిన మావోయిస్టులు ఇలాంటి ఎత్తుగడలు పన్నుతున్నారని ఈ వర్గాలు తెలిపాయి. దండకారణ్య కమిటీ, కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన నాయకుల పని కూడా పడతామని స్పష్టం చేశాయి.

# దసరా వేళ దడ పుట్టిస్తున్న వరుణుడు

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాలను దసరా వేళ మరింత దడ పుట్టించడానికి వరుణుడు రెడీ అవుతున్నాడు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఏపీ, తెలంగాణ జనాలను బెంబేలెత్తిస్తోంది. కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాలను వర్షాలు వణికిస్తున్నాయి. ఇప్పుడు మరింత తీవ్రం అవుతున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన శక్తిమంతమైన అల్పపీడన పరిస్థితులు కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత్ వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం బంగాళాతంలో బలపడుతున్న అల్పపీడనం కారణంగా ఏపీ తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ స్పష్టం చేసింది. అధికారులు, రైతులు, సాధారణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక బులెటిన్ జారీ చేసింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలతోపాటు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసింది. అల్పపీడనం ప్రభావం అత్యధికగా ఉండే ఉత్తరాంధ్ర జిల్లాలకు అత్యంత తీవ్రమైన రెడ్ అలర్ట్ ప్రకటించింది.



**రెడ్ అలర్ట్ జిల్లాలు ఇవే**

రాగల కొన్ని గంటల్లో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం అల్లూరి, విశాఖ, జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలకు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించింది.

**ఆరెంజ్ అల్ట్, మోస్తారు వర్షాలు**

అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తారు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మోస్తారు వర్షాలు కురిసినప్పటికీ పిడుగులు పడే ప్రమాదం ఉందని రైతులు, ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్టీఆర్, ఏలూరు, తిరుపతి, నెల్లూరు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు పేర్కొంటున్నారు అధికారులు, ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.వర్షాలతోపాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ప్రజలు హోర్డింగ్స్ కింద, చెట్ల కింద,పాడుబడిన భవనాల కింద ఉండొద్దని హెచ్చరించింది.

**తెలంగాణలో అతి భారీ వర్షాలు**

తెలంగాణలో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపు?, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజుల రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణశాఖ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో కూడా వానలు దంచికొట్టాయి. మంగళవారం నాడు ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ వర్షాల కారణంగా కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

**వర్షాలతో అతలాకుతలం**

తెలంగాణలో ఇప్పటికే కురిసిన వర్షాల కారణంగా సాధారణ జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. రహదారులపై నీరు నిలిచిపోయింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి, మెదక్, జనగాం,హైదరాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 16 సెంటీమీటర్‌ల వర్షం నమోదైంది. ఈ రికార్డులే వాతావరణ తీవ్రతను రాబోయే రోజుల్లో ఎదురుకాబోయే సవాళ్లను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.మరో అల్పపీడనం ఈ నెల 25న తూర్పు మధ్య, దానిని ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాత ప్రాంతంలో ఏర్పడే ఛాన్స్ ఉంది. ఈ అల్పపీడనం అక్కడితో ఆగకుండా మరింత బలపడి 26 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ బలపడిన వాయుగుండం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 27న దక్షిణ ఒడిసా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరం దాటే ఛాన్స్ ఉంది. ఇలా తీరం దాటే క్రమంలో తీరప్రాంత జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసేందుకు అవకాశం ఉందని పేర్కొంది.

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

**హైదరాబాద్ :** తెలంగాణవ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఎంగిలి బతుకమ్మతో ప్రారంభమైన వేడుకలు తొమ్మిది రోజులపాటు తెంగాణ వ్యాప్తంగా ,గ్రామగ్రామాన తీరొక్కపూలతో, భక్తిశ్రద్ధల నడుమ జరుపుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలు భుజానెత్తుకున్నాయి. అధికార కాంగ్రెస్, బీఆర్ ఎస్, బిజేపీకి తోడు ఈఏడాది వేరుకుంపటి పెట్టిన తెలంగాణ జాగృతి వరకూ ఇలా వివిధ రాజకీ పార్టీలు బతుకమ్మ వేడుకలను తమ ఖాతాలో వేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపధ్యంలో బతుకమ్మ చీరలు, పాటలు ఒకటేమిటి, ఏం చేసినా బతుకమ్మపై భక్తిని మరచి,పొలిటికల్ టార్గెట్ గా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో ఈ ఏడాది బతుకమ్మ పట్టణాలకు మాత్రమే పరిమితం కాదు, రాష్ట్రపండుగా మొత్తం రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సజ్జల బతుకమ్మ వరకూ భక్తి శ్రద్దలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసామంటోంది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం. ఈనెల 26వ తేది వరకూ తెలంగాణలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 27వ తేది నుంచి 30వ తేదీ వరకూ హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకులను కనివినీ ఎరుగని స్థాయిలో నిర్వహిస్తున్నామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. 28వ తేదిన లాల్ బహుదూర్ స్టేడియంలో 63 అడుగుల బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నీస్ బుక్ రికార్డును సొంతం చేసుకోబోతున్నామని చెబుతున్నారు. ఇక్కడివరకూ అంతా బాగానే ఉంది కానీ, బతుకమ్మ వేడుకల్లో పంచే చీరలకు ఇందిరమ్మచీరగా పేరు మార్చడంపై పొలిటికల్ దుమారం రేగుతోంది. బతుకమ్మ చీరలకు ఇందిరమ్మ పేర్లేంటని రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బతుకమ్మ పేరు లేదా తెలంగాణ మహిళల పేర్లు పెట్టాలికానీ ,ఇలా ఇందిరమ్మపేర్లు పెట్టడం వల్ల తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ ఎస్ సైతం బతుకమ్మ వేడుకలను వైభవంగా జరిపేందుకు కేడర్ ను సన్నద్దం చేసింది. ఇప్పటికే బిఆర్ఎస్ మహిళా నేతలు ఆయా జిల్లాలలో బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నారు. కానీ బిఆర్ఎస్ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో సైతం పొలిటికల్ అజెండా బలంగానే వినిపిస్తోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటను బిఆర్ ఎస్ పార్టీ అవహేళన చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ఉయ్యాల.. ఉయ్యాలో బతుకమ్మ అంటూ పాటను ప్రచారం చేయడం, అదే పాటతో బతుకమ్మ ఆడటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ విమర్శలు చేయాలంటే బతుకమ్మ పాటలను వాడుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తమవుతోంది.బిజెపి మహిళా మోర్చఆద్వర్యంలో ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు గతంలో ఎన్నడూ విధంగా వినూత్నంగా నిర్వహించడంతోపాటు, సాధ్యమైనంత ఎక్కువ మంది మహిళలతో మండల స్థాయిలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. బిఆర్ఎస్ నుంచి విడిపోయి వేరుకుంపటి పెట్టిన కవిత సైతం బతుకమ్మ వేడుకుల?లో తనకున్న బ్రాండ్ ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా దూసుకుపోతున్నారు. జాగృతి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే తన తండ్రి సొంత గ్రామం చింతమడక నుంచి బతుకమ్మ వేడుకులను ప్రారంభించిన కవిత తొమ్మిది రోజులపాటు తెలంగాణవ్యాప్తంగా వివిధ జిల్లాలలో బతుకమ్మ సంబురాలలో పాల్గొంటూ జాగృతి మార్క్ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇలా ఒక్కో పార్టీ ఒక్కో తీరుగా తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకులను కేవలం పొలిటికల్ అజెండాతో నిర్వహిస్తూ , తెలంగాణ తల్లికి బతుకమ్మను దూరం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా?యి. కల్మషంలేని తీరొక్కపూలతో జరిగే వేడుకులకు ఈ రాజకీయ రంగులేంటనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



# ఆకలి తీర్చడం ఆనందాన్ని ఇస్తుంది

**కమాన్ పూర్ :** ఆకలి తీర్చడం ఆనందాన్ని ఇస్తుందని సెంటినరీ కాలనీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మాలతి అన్నారు.లయన్ డా.శరణ్య యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంపెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అల్పాహార వితరణ చేశారు.లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో నిర్వహిస్తున్న “మీల్స్ ఆన్ వీల్స్” ద్వారా 729రోజులుగా నిత్య అల్పాహార పంపిణిలో భాగంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ అడ్మినిస్ట్రేటర్ ,ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య యాదవ్ పుట్టినరోజు సందర్భంగా డా.శరణ్య మారుతి యాదవ్ మరియు మాజీ జడ్పీటీసీ క్లబ్ డైరెక్టర్ గంటవెంకటరమణ రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత అల్పాహార వితరణ చేయడం జరిగింది. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎల్లపుడు పేదల కోసం పనిచేస్తుంది అని తెలిపారు.పుట్టిన రోజు వేడుకలకు హంగు హార్భటాలతో ఎదుటివారికి కళ్లలో ఆనందం కలిగించడం కన్నా, అందులో నుండి చిన్నపాటి ఖర్చుతో ఆకలితో ఉన్నవారికి ఆహారం పెట్టి వారి కళ్లలో ఆనందం చూడాలనుకోవడం చాలా గొప్ప విషయం. ఉదయాన్నే రోగులు, బంధువులు ఆకలితో ఎదురుచూస్తున్న వారికి అల్పాహారం అందించడం ద్వారా మనసుకు సంతృప్తినిచ్చిందనీ తెలిపారు.ఇట్టి కార్యక్రమాన్ని మేము చెప్పగానే విజయవంతం చేసిన లైన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపెల్లి సభ్యులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు.మీరు కూడా మీ పుట్టిన రోజు , పెళ్ళి రోజు మరియు ప్రత్యేకమైన రోజులలో మీ వంతుగా ఒక రోజు పేదవారికి ఆకలి చేయడానికి ముందుకు రావాలని కోరారు మరిన్ని వివరాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ 9014255745 కు సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మీల్స్ ఆన్ వీల్స్ కన్వీనర్ లయన్ బెల్లంకొండ జయపాల్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ సాదుల వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి అధ్యక్షులు లయన్ బొడకుంట రాంకిషన్, సెక్రటరీ లయన్ మీసాల సత్యనారాయణ ట్రెజరర్ లయన్ కళాశికం మహేందర్ రావు, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ వేల్పుల రమేష్ ,ఉపాధ్యక్షులు లయన్ జక్కుల సాయిలు, సీనియర్ సభ్యులు లయన్ ఆరెపల్లి కుమారస్వామి , లయన్ దుబాసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## మాటల్లోనే ప్రజాపాలన.. చేతల్లో రాజరికపు పాలన

### రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాటల్లోనే ప్రజాపాలన.. చేతల్లో రాజరికపు పాలన నడుస్తోందని మల్లేశ్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో క్యామ మల్లేశ్ మీడియాతో మాట్లాడారు.ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు పరిపాలన చేస్తేనే ప్రభుత్వం ఉంటుంది. రాష్ట్రంలో స్థానికసంస్థల గడువు ముగిసినా ఎన్నికలు పెట్టలేదు. అడవిబిడ్డ సీతక్క పంచాయతీ రాజ్ శాఖామంత్రిగా ఉన్నారు. 20 నెలలు నుంచి ఎన్నికలు పెట్టలేని అసమర్థ స్థితిలో సీతక్క ఉన్నారు. మంత్రి పదవికి సీతక్క రాజీనామా చేయాలి అని మల్లేశ్ డిమాండ్ చేశారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీకాలం ముగిసింది. ఎన్నికలు పెట్టకుండా రేవంత్ రెడ్డి సామంతరాజులను నియమిస్తారా. ప్రభుత్వంలో అసమర్థ మంత్రులుగా ఉండి ఏం చేస్తారు?? గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకోవడం, దాచుకోవడానికి పరిమితం అయ్యారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలకు ప్రోటోకాల్ ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదు అని క్యామ మల్లేశ్ హెచ్చరించారు.తుమ్మల నాగేశ్వరరావు క్యాబినెట్‌లో సీనియర్ మంత్రి. నలుగురు ముఖ్యమంత్రుల దగ్గర మంత్రిగా తుమ్మల వున్నారు. తుమ్మల నాగేశ్వరరావు ఒక్క బీజేపీలోనే చేరలేదు. సహకార సంఘాలకు ఆరు నెలల పదవీకాలం పొడిగించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో ఛైర్మన్‌ను రద్దు చేసి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. తుమ్మల నాగేశ్వరరావుకు మేము సలహాలు ఇచ్చే స్థితిలో లేము. హైకోర్టుకు వెళ్తే పాతవారిని ఛైర్మన్లుగా కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. నిజంగా మీరు మొగోళ్ళ అయితే ఎన్నికలు పెట్టండి. క్యాబినెట్‌లో ఉన్న కొంతమంది మంత్రులు నాకు తెలియదు అని మల్లేశ్ ఎద్దేవా చేశారు.సర్పంచుల్లో 51.5 శాతం బీసీలు వున్నారు. ఎంపీటీల్లో 50.5 శాతం బీసీలు వున్నారు. రిజర్వేషన్ల పేరుతో ఎన్నికలు పెట్టకుండా రేవంత్ రెడ్డి తప్పించుకుంటున్నారు. ఓడిపోతామనే భయంతో ఎన్నికలు పెట్టడం లేదు. ఎన్నికలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల తీర్పు కోరాలి అని క్యామ మల్లేశ్ సూచించారు.

## యువకుడితో గడిపి..అంతలోనే...

**హైదరాబాద్ :** వివాహేతర సంబంధాలు ప్రాణాలు తీస్తున్నాయి. కుటుంబాలను రోడ్డుకు ఈడ్చుతాయి. కొన్నిసార్లు హత్యలకు సైతం వెనుకాడటం లేదు. యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మహిళ అనుకోకుండా ఆత్మహత్య చేసుకుంది. వివాహిత ఉరేసుకుంటున్నది తన ఇంట్లో కావడంతో చుట్టుపక్కల వారిని సాయం అడగలేకపోయాడు. జాప్యం జరగడంతో వివాహిత ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన హైదరాబాద్ లోని నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 21న జరిగింది.నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా రెడ్యాలకి చెందిన 38 ఏళ్ల మహిళకు వివాహమై, ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె ఇంటి సమీపంలోని నాగోలులోని అంధుల కాలనీలో బానోత్ అనిల్ నాయక్ (24)తో ఆమెకు పరిచయం ఉంది. ఈ నెల 20న మహిళ తన మూడేళ్ల కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తున్నానని చెప్పి అనిల్ వద్దకు వెళ్లి గడిపింది. మరుసటి రోజు, అంటే సెప్టెంబర్ 21 రాత్రి వరకు అనిల్, వివాహిత కలిసే ఉన్నారు. రాత్రి అనిల్ కూరగాయలు తెచ్చేందుకు బయటకు వెళ్లొచ్చాడు. ఇంటికి వచ్చి చూడగా బాత్రూమ్‌లోకి వెళ్లి వివాహిత గడియ పెట్టుకుంది. తలుపు తీయమని యువకుడు పదే పదే అడిగినా ఎలాంటి స్పందన రాలేదు. అతను వెంటిలేటర్ నుండి చూడగా హ్యాంగర్‌కు చీరతో ఉరేసుకుంటున్నట్లు గమనించాడు. తర్వాత, తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే వివాహిత చనిపోయి వేలాడుతూ ఉంది. ఇతరులను పిలిస్తే తమ రిలేషన్ బటయ పడుతుందని ఒక్కడే కాపాడే ప్రయత్నం చేయగా, ఆలస్యం కావడంతో మహిళ ప్రాణాలు దక్కలేదు. వివాహిత చనిపోయిందని తన ఇంట్లో కనుక భయంతో యువకుడు అనిల్ ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈ క్రమంలో కత్తితో చేయి కోసుకున్నాడు. కానీ మృతురాలి మూడేళ్ల కుమారుడు ఏడుస్తూ కనిపించడంతో తన నిర్ణయం మార్చుకున్నాడు. వెంటనే చేతికి కట్టు కట్టుకుని పోలీస్ స్టేషన్ కు వెళ్లి జరిగింది చెప్పాడు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు నాగోలులోని పీఎస్ ఎదుట బైఠాయించారు. వివాహితను హత్య చేసిన అనిల్ ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## కులగణన లెక్కలు చెప్పండి



**హైదరాబాద్ :** కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే కుట్ర పన్నుతుందని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలోని కుల గణన సర్వే పూర్తి వివరాలు బయటపెట్టడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న చోట రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ప్రకటించే లోపే కులగణన సర్వే వివరాలు వెల్లడించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హడావిడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తే బీసీలకు అన్యాయం చేసినట్టే అని వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీల వారీగా కుల గణన వివరాలు వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేస్తుందని, రిజర్వేషన్ల పెంపు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారుతెలంగాణ ప్రభుత్వం కొన్ని నెలల కిందటే కులగణన సర్వే వివరాలు వెల్లడించింది. ఏ కులం, మతానికి చెందిన వారు తెలంగాణలో ఎంత మంది ఉన్నారో లెక్కలు అసెంబ్లీ వేదికగా సైతం తెలిపింది. అయితే కుల గణన సర్వేను రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర చేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. కొన్ని రోజుల కిందట బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దీక్ష చేశారు. తరచుగా బీసీ సంఘాల నేతలను కలిశారు. అన్ని పార్టీల నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం మద్దతు తెలపాలని కోరారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వివరాలు సమర్పించాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ సర్పంచ్ ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలు సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. సంబంధిత అధికారులు రూపొందించిన జాబితా, వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు.

**పూర్తి కావొస్తున్న హైకోర్టు ఇచ్చిన డెడ్ లైన్**

జులై నెలలో హైకోర్టు సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి డెడ్ లైన్ ఇవ్వడం తెలిసిందే. మరో వారం రోజుల్లో సెప్టెంబర్ పూర్తి కావొస్తుంది. బీసీ రిజర్వేషన్లను తన రాజకీయ అంశంగా తీసుకుని పోరాటం చేస్తున్న కవిత తాజాగా తెలంగాణ ప్రభుత్వంపై కుట్ర ఆరోపణలు చేశారు. కులగణన సర్వే వివరాలు పూర్తిగా ప్రజలతో పంచుకోవాలని, గ్రామపంచాయతీల వారీగా కులగణన వివరాలను బహిర్గతం చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వం హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని కవిత అభిప్రాయపడ్డారు. బీసీల రిజర్వేషన్లు పెంపు కోసం తెలంగాణ జాగృతి పోరాటం ఆపదని కవిత స్పష్టం చేశారు.

# మందారం టీ తాగితే మస్త్ మస్త్ లాభాలు..!

లెమన్ టీ, బ్లాక్ టీ, కాఫీ డికాక్షన్ సహా అనేక ఇతర టీలు కూడా ట్రెండ్ అవుతున్నాయి. వీటిలో ఒకటి మందార టీ. ఈ టీ గ్రీన్ టీ వలె ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ టీని తాగడం వల్ల చక్కెర తక్షణమే నియంత్రణలో ఉంటుంది. మందార టీ తాగడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి ఇతర వ్యాధులకు గణనీయమైన ప్రయోజనాలు లభిస్తాయని అనేక అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ రోజుల్లో గ్రీన్ టీ ట్రెండ్ అవుతోంది. అయినప్పటికీ కొంతమంది ఇప్పటికీ మిల్క్ టీపై ఆధారపడతారు. మంచి ఆరోగ్యం కోసం వైద్యులు గ్రీన్ టీ తాగమని సిఫార్సు చేస్తున్నారు. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి పరిస్థితులకు గ్రీన్ టీ తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే, లెమన్ టీ, బ్లాక్ టీ, కాఫీ డికాక్షన్ సహా అనేక ఇతర టీలు కూడా ట్రెండ్ అవుతున్నాయి. వీటిలో ఒకటి మందార టీ. ఈ టీ గ్రీన్ టీ వలె ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ టీని తాగడం వల్ల చక్కెర తక్షణమే నియంత్రణలో ఉంటుంది. మందార టీ తాగడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి ఇతర వ్యాధులకు గణనీయమైన ప్రయోజనాలు లభిస్తాయని అనేక అధ్యయనాలు పేర్కొన్నాయి. మందారం టీ తాగడం ద్వారా ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌తో పాటు ట్రైగ్లిజరాయిడ్ లెవెల్స్ తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఫ్యాట్ సమస్యతో బాధపడేవారు ఈ మందారం టీ తాగడం మంచిది. ఈ టీ రెగ్యులర్‌గా తాగడం ద్వారా రక్తపోటు అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే హైబీపీ సమస్యతో బాధపడేవారు ఈ హైబిస్కస్ టీ తాగడం మంచిది. హైబిస్కస్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.



ఇవి శరీరంలో ఇంఫ్లమేషన్ తగ్గిస్తాయి. కీళ్లు, కండరాల్లో మంట, వాపు సమస్య రాకుండా కాపాడుతాయి. దీంతో ఆర్థరైటిస్ ముప్పు లేకుండా చూసుకోవచ్చు. హైబిస్కస్ టీలో ఎలక్ట్రోలైట్స్ అధికంగా ఉంటాయి. అలాగే కెఫిన్ ఉండదు. కాబట్టి బాడీ డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. ధమనుల్లో పేరుకుపోయిన చెడు కొవ్వు కరిగించి రక్త ప్రసరణ మెరుగుపర్చడంలో ఈ హైబిస్కస్ టీ సహాయపడుతుంది. తద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.?హైబిస్కస్ టీలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇందులోని పోషకాలు మెటబాలిజం రేటు మెరుగుపర్చడంలో సహాయపడుతుంది. తద్వారా బరువు అదుపులో ఉంచుకోవచ్చు. హైబిస్కస్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచడంలో సహాయపడతాయి. అతద్వారా షుగర్ అదుపులో ఉంటుంది. చర్మం హైడ్రేట్ అవుతుంది. కాలేయంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించడంలో మందారం టీ సహాయపడుతుంది. ఈ టీ కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. తద్వారా కాలేయం సంబంధ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

# జీడిపప్పు ఎగబడి తింటున్నారా..?



జీడిపప్పులో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు కూడా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన హృదయాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. కానీ, జీడిపప్పు అతిగా తిన్నా, లేదంటే, కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారికి అస్సలు మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్రై ఫ్రూట్స్ తినడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అందుకే ఇటీవలి కాలంలో ప్రజలు ఎక్కువగా బాదం, వాల్‌నట్, ఎండుద్రాక్ష వంటి డ్రై ఫ్రూట్స్ తినడం ఎక్కువగా అలవాటు చేసుకుంటున్నారు. జీడిపప్పు పోషకాల భాండాగారం అని అందరికీ తెలిసిందే. దీనిలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, రాగి, థయామిన్, విటమిన్ బి6, విటమిన్ కె, పొటాషియం, ఇనుముతో సమృద్ధిగా ఉన్న జీడిపప్పు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చాలా అవసరం. వాటిలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు కూడా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన హృదయాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. కానీ, జీడిపప్పు అతిగా తిన్నా, లేదంటే, కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారికి అస్సలు మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీడిపప్పు చాలా మంది ఇష్టపడతారు. ఇందులో మంచి మోనో- పాలిఅన్‌సాచ్ కొవ్వులు, ప్రోటీన్, విటమిన్లూ ఖనిజాలూ ఉంటాయి. ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ దీ6 వంటి పోషకాలు శరీరానికి ఉపయోగపడతాయి. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి రోగనిరోధకశక్తిని బలోపేతం చేస్తాయి. కానీ జీడిపప్పులో కేలరీలు, కొవ్వు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా రోజుకు 5-10 పీసులు సరిపోతాయి. వ్యాయామం ఎక్కువ చేసే వారు లేదా అథ్లెట్లు కోసం 15-30 పీసులు వరకూ అనుకూలం. రోజుకు 30-40 పీసులు లేదా అంతకంటే ఎక్కువ తినడం ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఎక్కువ తీసుకుంటే బరువు పెరగడం, జీర్ణ సంబంధ సమస్యలు, ఉబ్బరం రావచ్చు. కొందరికి అలర్జీ ఉంటే జీడిపప్పు తీసుకునే ముందు జాగ్రత్త వహించాలి. ఖాళీ కడుపుతో జీడిపప్పు తినడం వల్ల కడుపులో మంట లేదా అజీర్తి వచ్చే అవకాశం ఉంది. దీన్ని అధికంగా తీసుకోవడం వల్ల కొవ్వు పెరగడానికి దారితీస్తుంది. అయితే, అలర్జీ సమస్యలు ఉన్నవారు జీడిపప్పును తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు.. బరువు పెరగడానికి ప్రయత్నిస్తున్నవారు జీడిపప్పును అధికంగా తీసుకోకూడదు. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు జీడిపప్పును తీసుకోవాలంటే, ముందుగా వైద్యుని సంప్రదించాలని సూచిస్తున్నారు.

# ఆ సమస్య ఉన్నవారు దానిమ్మ పండు తినకూడదు!



చిన్న ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మ రుచిని అందరూ ఆస్వాదిస్తారు. దీన్ని తినడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. దానిమ్మలో ఫైబర్ ఉంటుంది. కాబట్టి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మొత్తంమీద దానిమ్మ మన మొత్తం ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఈ పండు అందరికీ సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. కొంతమంది దీనిని తినే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని చెబుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితాల్లో చాలా మంది ఏదో ఒక వ్యాధి బారిన పడుతున్నారు. అందువల్ల ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఆకుపచ్చ కూరగాయలు, కాలానుగుణ పండ్లు మన ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు. వాటిని తినడం వల్ల మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.. దానిమ్మ అటువంటి పండ్లలో ఒకటి. చిన్న ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మ రుచిని అందరూ ఆస్వాదిస్తారు. దీన్ని తినడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. దానిమ్మలో ఫైబర్ ఉంటుంది. కాబట్టి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మొత్తంమీద దానిమ్మ మన మొత్తం ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఈ పండు అందరికీ సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. కొంతమంది దీనిని తినే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని చెబుతున్నారు.అలెర్జీలతో బాధపడేవారు దానిమ్మపండ్లు తినకుండా ఉండాలి. ఇది వారి అలెర్జీ ప్రతిచర్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. చర్మ అలెర్జీలు ఉన్నవారు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. ఇది ఇనుము లోపాలను పూరించడానికి సహాయపడుతుంది. ఇది చర్మంలో ఎరుపును పెంచుతుంది. లోబీపీ సమస్యతో బాధపడుతున్నవారు కూడా దానిమ్మకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. దానిమ్మ శీతలీకరణ ప్రభావం శరీరంలో రక్త ప్రసరణను నెమ్మదిస్తుంది. దీనివల్ల రక్తపోటు మరింత తగ్గుతుంది. రక్తం పలుచబరిచే మందులు వాడేవారికి ఇది హానికరం. రక్తస్రావం ప్రమాదం పెరగవచ్చు. కడుపు సమస్యలు ఉన్నవారికి ఇది సరిగ్గా సరిపోదు. విరేచనాలు, గ్యాస్ సమస్య మరింత పెరుగుతుంది. శ్వాసలో ఇబ్బందులు కూడా కలిగించవచ్చు. మధుమేహ రోగులు పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువ తింటే చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దానిమ్మ తినే ముందు డాక్టర్ సలహా మంచిది గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతుంటే దానిమ్మపండు తినడం హానికరం కావచ్చు. ఎందుకంటే, దానిమ్మపండు శీతలీకరణ ప్రభావం ఆహారం సరిగ్గా జీర్ణం కావడాన్ని కష్టతరం చేస్తుంది. ఇది మీ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. అదేవిధంగా వైరల్ ఇన్ఫెక్షన్ లేదా దగ్గు ఉంటే దానిమ్మను తినకూడదు. దాని శీతలీకరణ లక్షణాలు జలుబు, ఫ్లూను మరింత తీవ్రతరం చేస్తాయి. ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. మానసిక అనారోగ్యంతో ఉండి, మందులు తీసుకుంటుంటే, దానిమ్మ తినడం వల్ల రసాయన ప్రతిచర్య ఏర్పడుతుంది. నిజానికి, దానిమ్మ తినడం వల్ల మెదడులోని నరాలు చల్లబడతాయి. ఇది మెదడుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



# ఖాళీ కడుపుతో ఈ టీ తాగితే అద్భుతమే!

ఆయుర్వేదంలో తులసిని ఒక దివ్యౌషధంగా చెప్తారు. దీనిని ఆరోగ్య ప్రయోజనాలకు ఒక నిధి అని అంటారు. అందుకే ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తులసి టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. తులసి ఒక శక్తివంతమైన ఇమ్యునోమోడ్యులేటర్. దీనిలో ఉండే యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. ప్రతి ఉదయం తులసి టీ తాగడం వల్ల జలుబు, జ్వరం, ఫ్లూ వంటి కాలానుగుణ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, శరీరానికి బలమైన రక్షణ కవచాన్ని అందిస్తుంది. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి ఒక సాధారణ సమస్య. తులసి ఒక అద్భుతమైన అడాప్టోజెన్ మూలిక, ఇది శరీరం ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. తులసి టీ తాగడం వల్ల కార్టిసాల్ స్థాయిలు తగ్గి, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఇది నాడీ వ్యవస్థకు విశ్రాంతినిచ్చి, మానసిక స్పష్టతను పెంచుతుంది. జీర్ణక్రియ సమస్యలకు తులసి ఒక మంచి పరిష్కారం. దీని టీ గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. తులసిలో ఉండే సమ్మేళనాలు జీర్ణ ఎంజైమ్‌ల స్రావాన్ని పెంచి, ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తాయి. ఇది కాలేయాన్ని శుభ్రపరిచి, శరీరం నుండి విషపదార్థాలను తొలగిస్తుంది. తులసిలో యూజినాల్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి బలమైన శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ లక్షణం కీళ్ల నొప్పులు, తలనొప్పి లేదా కండరాల బెణుకులు వంటి వాటి వల్ల వచ్చే వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. క్రమం తప్పకుండా తులసి టీ తాగడం వల్ల దీర్ఘకాలిక నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది. తులసి టీ ఒక సహజమైన డిటాక్స్ పానీయం. ఇది కాలేయం, మూత్రపిండాలను శుభ్రపరచి, శరీరం నుండి విషపదార్థాలను తొలగిస్తుంది. దీని ప్రభావం చర్మంపై స్పష్టంగా కనిపిస్తుంది. తులసిలో ఉండే యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు మొటిమలు, మచ్చలు, ముడతలను తగ్గించి, చర్మాన్ని కాంతివంతంగా, యవ్వనంగా ఉంచుతాయి. తులసి ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి చాలా ప్రయోజనకరం. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ అద్భుతమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, మీరు కూడా మీ రోజును ఒక కప్పు తులసి టీతో ప్రారంభించడం మంచిది.

# బిజినెస్

## పన్నులు తగ్గడంతో మారుతీ సుజుకి, హ్యూండాయ్ కార్ల కోసం రికార్డు బుకింగ్‌లు




జీఎస్టీ పన్నులు తగ్గడంతో పాటు పండుగ సీజన్, కంపెనీలు ధరలు సవరించడంతో ఈ ఏడాదికి వాహన పరిశ్రమ రికార్డు స్థాయిలో డిమాండ్‌ను చూస్తోంది. ఇప్పటికే మారుతీ సుజుకి, హ్యూండాయ్ మోటార్ ఇండియా ఊహించని స్థాయిలో బుకింగ్‌లు సాధించామని వెల్లడించాయి. దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకి ఇప్పటికే అత్యధిక ఎంక్వైరీలు, బుకింగ్‌లు అందుకున్నామని తెలిపింది. గత 35 ఏళ్లలో చూడని స్థాయిలో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం అమలులోకి రావడంతో సోమవారం మొదటిరోజే 80,000 ఎంక్వైరీలు వచ్చాయని, 25,000 కంటే ఎక్కువ కార్లను డెలివరీ చేశామని వెల్లడించింది. ఇప్పటివరకు 75,000 బుకింగ్‌లు వచ్చాయని, రోజుకు 15 వేల బుకింగ్‌లు జరుగుతున్నాయి. త్వరలో మేము 30,000 డెలివరీలు ఇవ్వగలమని, ఇప్పటివరకు బుకింగ్‌లు సాధారణంగా వచ్చే దానికంటే 50 శాతం ఎక్కువ బుకింగ్‌లు అవుతున్నాయని మారుతీ సుజుకి మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ అన్నారు. హ్యూండాయ్ మోటార్ సైతం నవరాత్రి మొదటి రోజు కావడంతో ఐదేళ్లలోనే అత్యధిక సింగిల్-డే బిల్లింగ్ జరిగినట్టు కంపెనీ హోల్-టైమ్ డైరెక్టర్, సీఓఓ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు.

## తగ్గిన ఉత్పత్తులతో 'జీఎస్టీ స్టోర్'




## ప్రత్యేక సెక్షన్ ప్రారంభించిన అమెజాన్

కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేసిన జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి కస్టమర్లకు ప్రయోజనాలను అందించేందుకు ఈ-కామర్స్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే అమెజాన్ ఇండియా కూడా తగ్గిన పన్నుల గురించి కస్టమర్లకు తెలిసేలా ప్రత్యేక సెక్షన్‌ను తీసుకొచ్చింది. పన్నులు తగ్గిన ఉత్పత్తులు విడిగా కనిపించేలా 'జీఎస్టీ స్టోర్ ' పేరుతో సెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఇతర విభాగాల్లో తక్కువ ధరలు ఉన్న వాటిని ఈ సెక్షన్‌లో పొందుపరిచింది. మంగళవారం(సెప్టెంబర్ 23) నుంచి గ్రేట్ ఇండియా ఫెస్టివల్ సేల్ ప్రారంభం కానుండటంతో అమెజాన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైమ్ సభ్యులకు సెప్టెంబర్ 22 అర్ధరాత్రి నుంచే ముందస్తు యాక్సెస్ లభిస్తుంది. జీఎస్టీ స్టోర్ బ్యాడ్జ్ వల్ల కస్టమర్లు తగ్గిన పన్ను ఆఫర్లను సులభంగా గుర్తించడం, షాపింగ్ చేయడానికి వీలవుతుంది. ప్రైమ్ ఎర్లీ యాక్సెస్ సమయంలో ఈ బ్యాడ్జ్ ప్రైమ్ డీల్‌ంజీఎస్టీ సేవింగ్స్ అని ఉంటుంది. సేల్ అందరికీ ఉన్న

# 375 వస్తువుల ధరలు తగ్గుతాయ్



గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) సంస్కరణలు సెప్టెంబర్ 22, 2025 నుంచే అమలులోకి వస్తున్నాయి. ఈనెల మొదటి వారంలో వస్తు సేవల పన్ను మండలి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 5, 18 శాతం పన్ను శ్లాబులను కొనసాగిస్తూ 12, 28 శ్లాబులను తొలగించింది. దీంతో సెప్టెంబర్ 22 నుంచి 5, 18 శాతం పన్ను శ్లాబులే అమలు అవుతాయి. దీంతో ఏకంగా 375 రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఈ జాబితాలో డైరీ ప్రొడక్ట్స్, కార్లు, ఔషధాలు, వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు చాలా కేటగిరీల వస్తువులు ఉన్నాయి. ఏ వస్తువుల ధరలు తగ్గుతున్నాయి? ముఖ్యమైన వాటి జాబితా ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఆహార పదార్థాల జాబితాలో పాలతో ఉన్న పానియాలు, ఘనీభవించిన పాలు, బిస్కెట్లు, కార్న్ ఫ్లేక్స్, సీరల్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ పల్ప్, ఫ్రూట్ జూస్, నెయ్యి, ఐస్ క్రీమ్, జామ్, ఫ్రూట్ జెలీస్, కెచప్, ఉప్పు, పనీర్, పాస్ట్రీ, మాంసం, ప్యాకేజ్డ్ కొబ్బరి నీళ్లు ఉన్నాయి. షేవ్ లోషన్, ఫేస్ క్రీమ్, ఫేస్ పౌడర్, హెయిర్ ఆయిల్, షాంపూ, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌండర్, టూత్ బ్రస్, టాయిలెట్ సబ్బులు వంటివి ఉన్నాయి. ఎయిర్ కండీషనర్లు, డిష్ వాషర్స్, టీవీలు, వాషింగ్ మెషన్స్ ఉన్నాయి. డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకో మీటర్లు వంటి మెడికల్ డివైజులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గుతుంది. దీంతో వాటి ధరలు తగ్గుతాయి. వాటిపై ఎంఆర్‌పీ ధరలను తగ్గించాలని కేంద్రం ఫార్మసీలను ఆదేశించింది. బార్బర్స్, ఫిట్‌నెస్ సెంటర్స్, హెల్త్ క్లబ్స్, సెలూన్స్, యోగా కేంద్రాల వంటి వాటిపై జీఎస్టీ తగ్గుతుంది. వాటి ధరలు దిగివస్తాయి. ఇంటి కొనుగోలుదారులు లేదా నిర్మాణదారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. సిమెంట్ ధరలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది. దీంతో నిర్మాణ ఖర్చు భారీగా తగ్గనుంది. కార్లు, ఇతర వాహనాలపై జీఎస్టీ భారీగా తగ్గుతుంది. ఇంతకు ముందు పన్నులు సెస్ తో కలిపి 35 శాతం నుంచి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు ఫ్లాట్ 40 శాతం గా మార్చారు. సెస్ ఎత్తివేశారు. దీంతో గరిష్ఠ పన్ను ఇదే. అలాగే చిన్న కార్లపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఇప్పటికే మారుతీ, టాటా వంటి కంపెనీలు ధరల తగ్గింపు ప్రకటనలు చేశాయి. వీటితో పాటు ప్రముఖ కన్స్యూమర్ బ్రాండ్లు అముల్, హెచ్‌యూఎల్, లోరియల్, హిమాలయా వంటివి తమ ఉత్పత్తులపై ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటనలు చేశాయి.

# సేవింగ్స్ ఖాతా ఉంటే చాలు.. రోజుకు రూ.1,50,000.. 6.5 శాతం వడ్డీ



ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సహా దాదాపు అన్ని బ్యాంకుల్లో పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు 3 శాతం లోపే ఉంటుంది. కొన్ని బ్యాంకులు మాత్రమే అధిక డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇస్తాయి. అయితే, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. సేవింగ్స్ ప్రో అకౌంట్ లాంచ్ చేసినట్లు ప్రకటించింది. ఈ బ్యాంకు ఖాతాలో ఉండే అదనపు డబ్బులపై ఎక్స్‌ట్రా రిటర్న్ ఆఫర్ చేస్తున్నట్లు తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఆటో స్వీప్ అకౌంట్. అకౌంట్లో ఉండే అదనపు ఫండ్స్‌ని ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి గరిష్ఠ వడ్డీ ఆదాయం అందిస్తామని తెలిపింది.జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ సేవింగ్స్ ప్రో అకౌంట్ ద్వారా ఆటోమేటిక్‌గా అదనపు డబ్బులను ఓవర్ నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి 6.50 శాతం వరకు రిటర్న్ అందించే ప్రయత్నం చేస్తుంది. గ్రోత్ ప్లాన్స్‌లోని 2 ఏళ్ల వార్షిక లాభాల ఆధారంగా ఈ రిటర్న్ ఉంటాయని తెలిపింది. సేవింగ్స్ ప్రో అనేది ఒక ఆటో స్వీప్ సేవింగ్స్ అకౌంట్. ఈ ఖాతా తీసుకున్నవారు థ్రెషోల్డ్ అమౌంట్ ఎంపిక చేసుకోవాలి. కనీసం రూ.5000గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అంటే ఈ రూ.5 వేలకు మించి అమౌంట్ ఖాతాలో ఉన్నప్పుడు ఆ డబ్బులను తక్కువ రిస్క్ ఉండే ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఆటమేటిక్‌గా ఇన్వెస్ట్ చేస్తారు. ఈ సౌకర్యం ద్వారా రోజుకు గరిష్ఠంగా రూ.1,50,000 వరకు పెట్టుబడి పెట్టే అవకాశం కల్పిస్తున్నట్లు జియో పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ నిబంధనల ప్రకారం రిడంప్షన్ ఆప్షన్స్ ఉంటాయి. కస్టమర్లు తక్షణే 90 శాతం వరకు ఫండ్స్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. గరిష్ఠంగా రూ.50 వేల వరకు తీసుకోవచ్చు. అంతకు మించితే 1 టూ 2 వర్కింగ్ డేస్‌లో ప్రాసెసింగ్ అవుతుంది. ఈ స్కీమ్‌లో ఎలాంటి హిడెన్ ఛార్జీలు, ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్స్, లాకిన్ పీరియడ్స్ ఉండవు.

# బంగ్లాదేశ్‌పై భారత్ ఫైనల్ బెర్త్ లాక్ చేసుకోవడానికి సిద్ధం




ఆసియా కప్ 2025లో భారత్ జట్టు అద్భుతమైన ఫామ్‌లో ముందుకు సాగుతోంది. సూపర్-4 దశలో పాకిస్థాన్‌పై సాధించిన ఆరు వికెట్ల తేడాతో విజయం భారత్‌కు భారీ ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది.అభిషేక్ శర్మ (74 బంతుల్లో 39 రన్స్) మరియు శుభ్మాన్ గిల్‌ల మొదటి వికెట్‌కు 105 రన్స్ పార్టనర్‌షిప్, తిలక్ వర్మా (30లి ఆఫ్ 19) ఫినిషింగ్ టచ్‌లు ఈ విజయానికి కీలకం. పాకిస్థాన్ 171/5కి పరిమితమైంది, భారత్ 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని సులభంగా చేరుకుంది. ఈ విజయంతో భారత్ సూపర్-4 పాయింట్స్ టేబుల్‌లో టాప్ స్థానంలో ఉంది, ఫైనల్ బెర్త్ కోసం ఒక అడుగు ముందుంది. రేపు (సెప్టెంబర్ 24) బంగ్లాదేశ్‌తో జరిగే కీలక మ్యాచ్ భారత్‌కు ఫైనల్ టికెట్ ఖాయం చేసుకునే అవకాశాన్ని అందిస్తుంది. బంగ్లాదేశ్ గ్రూప్ స్టేజ్‌లో శ్రీలంకకు ఓడిపోయి, ఇతర మ్యాచ్‌లలో కష్టపడినా, సూపర్-4లో బలమైన ప్రదర్శన చేస్తున్నారు. అయితే, భారత్ పోలీషింగ్ బ్యాటింగ్ మరియు బౌలింగ్ లైనప్‌తో ఈ మ్యాచ్‌ను డామినేట్ చేయగలదు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే ఈ టీ20 మ్యాచ్‌లో, టాస్ మరియు పిచ్ కండిషన్స్ కీలకం. భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ మ్యాచ్‌ను విన్‌రీ చేసుకుంటే, ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయం అవుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తుది జట్టులో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లలో బుమ్రా ఫామ్‌లో లేకపోవడం, సంజు సమ్సన్ స్కోరింగ్‌లో ఇబ్బంది పడటంతో వారిని బెంచ్‌కు పంపి, అర్ష్‌దీప్ సింగ్ మరియు జితేష్ శర్మాను బ్రింగ్ చేయవచ్చు. బంగ్లాదేశ్ బలహీనమైన బౌలింగ్ లైనప్‌కు వ్యతిరేకంగా, భారత్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మరింత బలోపేతం చేయాలి. ఈ మార్పులు భారత్‌కు మరింత ఫ్రెష్‌నెస్ మరియు బ్యాలెన్స్‌ను తీసుకొస్తాయి, ముఖ్యంగా మిడిల్ ఓవర్‌లలో బౌలర్లు కొంత లీకేజీ చూపిన నేపథ్యంలో.


## మ్యాచ్‌కు ముందే పాకిస్థాన్ ఎదురుదెబ్బ!




ఆసియా కప్ 2025 టోర్నమెంట్లో భాగంగా ఇవాళ మరో సూపర్ ఫైట్ జరగనుంది. సూపర్ ఫోర్ లో భాగంగా అబుదాబీలోని అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక వర్సెస్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఇవాళ ఉంది.భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 8 గంటల సమయంలో ఎప్పటిలాగే ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్ రెండు జట్లకు చాలా కీలకము. ఎందుకంటే సూపర్ ఫోర్ లో భాగంగా ఇప్పటికే చెరో మ్యాచ్ ఆడాయి ఈ రెండు జట్లు. ఇందులో పాకిస్తాన్....టీమిండియా చేతిలో ఓడిపోగా... బంగ్లాదేశ్ చేతిలో శ్రీలంక ఓడిపోయింది. అంటే ఈ రెండు జట్లు ఇవాల్టి మ్యాచ్ కచ్చితంగా గెలవాలి. గెలిచిన జట్టుకే ఫైనల్ అవకాశాలు ఉంటాయి. ఇవాళ ఏ జట్టు ఓడిపోయినా ఇంటికి వెళ్లడం గ్యారంటీ. ఇలాంటి నేపథ్యంలో పాకిస్తాన్ కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఇవాల్టి మ్యాచ్ కు మరోసారిగా ఆండీనే రంగంలో దించబోతున్నారని తెలుస్తోంది. పాకిస్తాన్ ఆడే ప్రతి మ్యాచ్ కు అతడే రిఫరీగా ఉంటారట. ఇండియా షేక్ హ్యాండ్ ఇవ్వనందుకుగాను...ఆండీ పైన పాకిస్తాన్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

# స్పోర్ట్స్

## వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు భారత్‌కు షాక్..



ఆసియా కప్ 2025 టోర్నీ ముగిసిన రోజుల వ్యవధిలోని టీమిండియా.. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఇందుకోసం మంగళవారం లేదా బుధవారం భారత జట్టును ఎంపిక చేయనున్నారు.ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అయితే అండర్సన్, సచిన్ టెస్ట్ సిరీస్‌లో గాయపడ్డ టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ .. ఈ సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలు కనిపించడం లేదు.వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అక్టోబర్ 2 నుంచే ప్రారంభం కానుంది. అంటే ఇంకా పది రోజుల సమయం ఉంది. కానీ పాదానికి తీవ్ర గాయం కావడంతో ఆసియాకప్‌కు దూరమైన పంత్.. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు సైతం దూరం కానున్నాడని వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా ఎంపికకానున్నాడు. అతడికి బ్యాకప్ వికెట్ కీపర్‌గా నారయణ్ జగదీషన్ జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో టీమిండియా వైస్ కెప్టెన్‌గా పంత్ వ్యవహరించాడు. అతడు లేకపోవడంతో గిల్‌కు డిప్యూటీగా కేఎల్ రాహుల్ నియమితుడయ్యే అవకాశం ఉంది. ఇక ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో నిరాశపరిచిన కరుణ్ నాయర్‌కు చోటు దక్కకపోవచ్చు. ఆసియా కప్ 2025 టోర్నీకి దూరంగా ఉన్న మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం భారత్-ఏ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా-ఏతో అనధికారిక టెస్ట్ సిరీస్ ఆడుతున్నాడు. అతడు టెస్ట్ టీమ్‌లోకి రానున్నాడు. దేవ్‌దత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ సైతం రేసులో ఉన్నారు. గాయం నుంచి కోలుకున్న నితీశ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం ముమ్మర సాధన చేస్తున్నాడు. అతడు సైతం వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికకానున్నాడు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com




# ఆయన నాలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని నింపుతున్నారు




యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు దాటి' చిత్రంతో వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాంతార చాప్టర్: 1'. రిషబ్ శెట్టి స్వయం దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని హొంబలే ఫిల్మ్స్ భారీ డ్జెట్‌తో నిర్మిస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ క్రమంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన చిత్రబృందం వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు.తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ లాంచ్ చేయగా.. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న రుక్మిణి ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నా ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకు మూవీ టీమ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రిషబ్ శెట్టి మొదటి నుంచి నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఇప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే ఇలాంటి గొప్ప పాన్ ఇండియా మూవీలో అవకాశం అందుకున్నాను. నిజంగా ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. చాన్స్ ఇచ్చిన రిషబ్ శెట్టికి కృతజ్ఞతలు తెలియజేయడానికి నా దగ్గర పదాలు లేవు. ఆయన ఎప్పటికప్పుడు నాలో కొత్తదనాన్ని నింపుతూ.. నన్ను ప్రోత్సహిస్తూ ఇప్పుడు మీ ముందు యువరాణిలా నిల్చోబెడుతున్నారు. దీనికి ఆయనకు నేను రుణపడి ఉంటా. షూటింగ్ సమయంలో రిషబ్ శెట్టి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నా జీవితాన్ని పూర్తిగా మార్చేసిన 'కాంతార' నాకు మరో జీవితాన్ని ప్రసాదిస్తుందని భావిస్తున్నా" అని చెప్పుకొచ్చింది.



# అర్జున్ దాస్ దశ తిరుగుతోంది

వయసు చిన్నదే అయినా విలనీ పండించడంలో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ దాస్ చేసింది తక్కువ సినిమాలే. అయినా సరే ప్రేక్షకుల్లో తగినంత గుర్తింపు ఉంది. ముఖ్యంగా అతని బేస్ వాయిస్ కున్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. కల్కి 2898 ఏడి కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓవర్ చెప్పించారంటే తన రీచ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఓజి టీజర్ లో అలాంటోడు మళ్ళీ తిరిగి వస్తున్నాడంటే డైలాగు మారుమ్రోగిపోవడానికి కారణం కూడా ప్రత్యేకంగా అనిపించే గొంతే. ఇమ్రాన్ హష్మీతో పాటు విలన్ గా అర్జున్ దాస్ కూడా ఓజిలో ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. ఇది పెద్ద బ్రేక్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాడు.అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీలో విలన్ గా డ్యూయల్ రోల్ చేసి మెప్పించిన అర్జున్ దాస్ కు ఇప్పుడు బాలీవుడ్ అవకాశాలు తలుపు తడుతున్నాయి. రణ్వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందబోయే డాన్ 3లో విలన్ గా అర్జున్ దాస్ నే సంప్రదించారని ముంబై టాక్. లుక్ టెస్ట్, శాంపిల్ షూట్ చేసి సరిపోతాడనుకుంటే వెంటనే అడ్వాన్స్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నారట. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ లాంటి లెజెండరీ హీరోలు చేసిన పాత్ర కావడంతో రణ్వీర్ సింగ్ డాన్ 3 కోసం చాలా ప్రిపేర్ అవుతున్నాడు. ఇంకా ప్రారంభం కానప్పటికీ స్క్రిప్ట్ స్టేజిలోనే ఒకటికి పదిసార్లు వడబోత చేస్తున్నారు. నిజంగా అర్జున్ దాస్ కనక డాన్ 3కి ఎంపికైతే బాలీవుడ్ లో మెల్లగా జెండా పాతేయొచ్చు. అసలే అక్కడ విలన్ల కొరత తీవ్రంగా ఉంది. అందులోనూ డాన్ ఫ్రాంచైజ్ అంటే క్రేజ్ ఖచ్చితంగా ఉంటుంది. మరి అర్జున్ దాస్ కి ఆ అదృష్టం రాసిపెట్టి ఉందో లేదో చూడాలి. తెలుగులో ఆక్సిజన్ తో ఎంట్రీ ఇచ్చిన ఇతను మళ్ళీ బుట్టబొమ్మలోనే కనిపించాడు. రెండూ పెద్దగా ఆడలేదు. తమిళ డబ్బింగులు మాస్టర్, విక్రమ్, ఖైదీ ఎక్కువ పేరు తీసుకొచ్చాయి. ఇప్పుడు ఓజి రూపంలో కనక బ్లాక్ బస్టర్ అందుకుంటే ఇక్కడా బిజీ అయిపోవచ్చు. ఆల్రెడీ పలువురు నిర్మాతలు కలిశారట కానీ ఓజి రిజల్ట్ వచ్చాకే చెబుతానని అన్నాడట.



# ఇక అందరూ సైడ్ అవ్వాల్సిందే !


ఇండస్ట్రీ లోకి చాలామంది హీరోయిన్లు వస్తున్నారు. ఇందులో కొంతమంది సక్సెస్ అవుతుంటే... మరికొంతమంది సక్సెస్ అయ్యేందుకు చాలా కష్టపడుతున్నారు.ఇక మరికొంతమంది హీరోయిన్లు... అతి తక్కువ కాలంలోనే పెద్ద సినిమాల్లో ఛాన్సులు కొట్టేస్తున్నారు. అయితే ఇలాంటి కేటగిరీలోకి హీరోయిన్ రుక్మిణి వసంత్ కూడా వస్తారు. కర్ణాటక కు చెందిన రుక్మిణి వసంత్ 2019 నుంచి ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. కన్నడ, తమిళ్, తెలుగు లో ఇప్పటికే సినిమాలు చేశారు ఈ అందాల తార. తెలుగులో అప్పుడో ఇప్పుడు ఎప్పుడో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న డ్రాగన్ సినిమాలో కూడా ఆమెకు ఛాన్స్ దక్కింది. అయితే... ఈ రుక్మిణికి కాంతార చాప్టర్ 1 లో కూడా ఛాన్స్ దక్కింది. ఈ సినిమా దసరా కానుగా రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో కాంతార చాప్టర్ 1 మూవీ ట్రైలర్ రిలీజ్ అయింది. ఇందులో హీరో రిషబ్ శెట్టితో రొమాన్స్ కూడా చేసిన విజువల్స్ వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె గ్లామరస్ ఫోటోలు కూడా ట్రెండింగ్ లోకి వచ్చాయి. ఇక ఈ ఫోటోలు చూసిన సినీ ప్రియులు స్పందిస్తున్నారు. రుక్మిణి వసంత్ కూడా రష్మిక, సాయి పల్లవి లాగే మరో 10 ఏళ్ల ఇండస్ట్రీని షేక్ చేయడం గ్యారెంటీ అంటున్నారు. డ్రాగన్ సినిమా రిలీజ్ అయితే తెలుగులో నెంబర్ 1 హీరోయిన్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు చెబుతున్నారు.

# ఆశ, అంధకారానికి మధ్య జరిగే యుద్ధం



దర్శకుడు ప్రశాంత్ వర్మ, మరో సూపర్ హీరో సినిమా 'అధీర' కోసం ఆర్.కె.డి స్టూడియోస్‌తో కలిసి పని చేయ బోతున్నారు. ఈ సినిమాతో కళ్యాణ్ దాసరి హీరోగా పరిచయం అవుతుండగా, కీలక పాత్రలో ఎస్.జే.సూర్య కనిపించనున్నారు. రివాజ్ రమేష్ దుగ్గల్ నేతృత్వంలోని ఆర్కేడీ స్టూడియోస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ చిత్రం భారతీయ ఇతిహాసాల స్ఫూర్తితో, గ్రేట్ విజువల్స్‌తో తెరకెక్కుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎస్.జే.సూర్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. క్రూరమైన రాక్షసుడిలా ఉన్న సూర్య ముందే కళ్యాణ్ దాసరి మోకాళ్లపై కూర్చుని ధైర్యంతో పైకి చూస్తూ మోడరన్ వార్ అవతార్‌లో ట్రూ సూపర్ హీరోలా ఈ పోస్టర్‌లో కనిపించారు. ఇది ఆశ, అంధకారం మధ్య జరిగే యుద్ధం. ధర్మాన్ని రక్షించడానికి కళ్యాణ్ దాసరి తన సూపర్ పవర్స్‌ని ఉపయోగిస్తారు. అద్భుతమైన యాక్షన్, స్టంట్స్, గ్రేట్ విజువల్స్, హై వోల్టేజ్ డ్రామాతో ఈ సినిమా థియేటర్స్‌లో థండర్‌క్లాప్ ఎక్స్‌పీరియెన్స్ అందించనుంది అని మేకర్స్ తెలిపారు.

# దయచేసి ఆ వార్తలు నమ్మకండి..



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈక్రమంలో ఆయన ఓ సినిమాలో వాల్మీకి మహర్షి పాత్రలో నటిస్తున్నట్లు ఏఐతో క్రియేట్ చేసిన పలు వీడియోలు వస్తున్నాయి. ఇక అది చూసిన అక్షయ్ కుమార్ ఫుల్ ఫైర్ అయ్యాడు. ట్విట్టర్ ద్వారా ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ కీలక నోట్ రిలీజ్ చేశారు. "గత కొద్ది కాలంగా కొన్ని తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయి. దీనిపై నేను క్లారిటీ ఇవ్వదలుచుకున్నాను. నేను మహర్షి వాల్మీకి పాత్రలో నటిస్తున్నట్లు.. ట్రైలర్ కూడా విడుదలైనట్లు కొన్ని వీడియోలను చూశాను. అవి ఏఐని ఉపయోగించి సృష్టించబడ్డాయని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. అవన్నీ ఫేక్ దయచేసి మీరు నమ్మకండి. దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్ని వార్తా ఛానెల్‌లు ఇవి నిజమైనవా లేదా మార్ఫింగ్ చేయబడినవా అని కూడా ధృవీకరించకుండా వార్తలు రాశారు. నేటి కాలంలో, మోసపూరిత ఏఐ ద్వారా తప్పుదారి పట్టించే కంటెంట్ చాలా వేగంగా ఉత్పత్తి అవుతుంది. నిజమైన వాటికంటే అవే ఎక్కువ వేగంగా వైరల్ అవుతున్నాయి. దీనిని గమనించాలని అభ్యర్థిస్తున్నాను. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు దాన్ని పరిశీలించాలని కోరుతున్నా. వాస్తవాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని రాసుకొచ్చారు. కానీ ఆ సినిమా పేరును మాత్రం రివీల్ చేయలేదు. దీంతో ఈ పోస్ట్ చూసిన వారంతా 'రామాయణ' గురించే అని చర్చించుకుంటున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com